RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 39 | బుధవారం, మార్చి 06, 2024 | పేజీలు : 4

## మంత్రి జయరాం వైసిపికి రాం రాం

అమరావతి: సిఎం జగన్ మోహన్ రెడ్డి విధానాలతోనే విసుగు చెందానని మంత్రి జయరాం తెలిపారు. తాను మంత్రి పదవికి రాజీనామా చేయడంతో పాటు వైసిపి సభ్యత్వానికి, ఎంఎల్ఏ పదవికి రాజీనామా చేశానని జయరాం స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో గుంతకల్లు నుంచి టిడిపి తరపున పోటీ చేస్తానని చెప్పారు. గుడిలో శిల్పం మాదిరిగా జగన్ తయ్యారయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలో ఇద్దరు పూజారులు సజ్జల, ధనుంజయ రెడ్డి ఉన్నారని, వారు చెప్పిందే జగన్ చేస్తున్నారని మండిపడ్డారు. జయరాం ప్రస్తుతం ఆలూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవలే ఆలూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా గుమ్మనూరును సిఎం జగన్ తొలగించడంతో పాటు అసెంబ్లీ టికెట్ నిరాకరించారు.

### కుటుంబ పార్టీలు దోచుకోవడానికి ఏమైనా...

# లైసెన్స్ ఉందా?



**సంగారెడ్డి మార్చి, 5 :** తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతరం కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. సంగారెడ్డిలో జరిగిన బిజెపి విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. నిన్న ఆదిలాబాద్ నుంచి రూ.56 వేల కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించామని, ఇవాళ సంగారెడ్డి నుంచి రూ.7 వేల కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించామని తెలియజేశారు. రాష్ట్రాల అభివృద్ధే దేశ అభివృద్ధిగా తాను నమ్ముతున్నానని, బేగంపేటలో సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు చేశామని, దేశంలోనే తొలి సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ కేందం ఇది అని, దీని ద్వారా హైదరాబాద్, తెలంగాణకు మంచి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. ఏవియేషన్ కేంద్రం, స్టార్టప్‌లు, నైపుణ్య శిక్షణకు వేదికగా హైదరాబాద్ నిలుస్తుందని ప్రశంసించారు. పదేళ్లలో దేశంలో విమానాశ్రయాల సంఖ్య రెట్టింపుగా మారాయని, ప్రస్తుతం భారత్ ప్రపంచానికి ఆశాకిరణంలా మారిందని, భారత్‌ను ప్రపంచంలో సరికొత్త శిఖరాలకు చేర్చాలని పిలుపునిచ్చారు.

ప్రపంచ దేశాల్లో తెలుగు ప్రజలు కీలకభూమిక పోషిస్తున్నారని మోడీ ప్రశంసించారు. ప్రజల ఆశీర్వాదాలు వృథా కానివ్వను అని, ఇది మోడీ గ్యారంటీ అని, మోడీ ఏదైతే చెబుతాడో అదే చేసి చూపుతాడని స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆర్టికల్ 370 రద్దు హామీ అమలు చేశామని, అయోధ్య రామ మందిరం నిర్మించి తీరామని, ప్రపంచ గర్వించే రీతిలో అయోధ్యలో రాముడి ప్రతిష్టాపన జరిగిందని కొనియాడారు. అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ గల దేశంగా తీర్చిదిద్దడమే మరో గ్యారంటీ అని అన్నారు.

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కుటుంబ పార్టీలు పాలించడంతో వాళ్లే బాగుపడ్డారని విమర్శలు గుప్పించారు.

కుటుంబ పార్టీలు దేశాన్ని దోచుకోవడానికి ఏమైనా లైసెన్స్ ఉందా? అని మోడీ ప్రశ్నించారు. వారసత్వ రాజకీయాలను తాము వ్యతిరేకిస్తున్నామని, కుటుంబ పార్టీల వల్ల ప్రతిభ ఉన్నవారికి అన్యాయం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మహబూబ్‌నగర్ నుంచి తన తమ్ముడి పోటీ...

# రేవంత్ రెడ్డి క్లారిటీ!

**హైదరాబాద్ మార్చి, 5 :** రానున్న లోక్ సభ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి సోదరుడు మహబూబ్ నగర్ నుంచి బరిలోకి దిగుతున్నట్లుగా ప్రచారం సాగింది. అయితే తమ కుటుంబం నుంచి ఎవరూ పోటీ చేయడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో విచ్చాపాటిగా మాట్లాడుతూ... తన తమ్ముడి పోటీ చేయడం లేదని రేవంత్ రెడ్డి స్పష్టతనిచ్చారు. అలాగే మోదీని పెద్దన్నగా పేర్కొనడంపై బీఆర్ఎస్ టార్గెట్ చేస్తోంది. దీంతో తనది అంతా బహిరంగమే అన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోజుకు రెండున్నర కోట్ల ఇసుక ఆదాయం పెరిగినట్లు రేవంత్ చెప్పారు. జీఎస్టీ ఆదాయం రూ.500 కోట్లు పెరిగినట్టు పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్‌పై అధికారుల నివేదిక వచ్చాక స్పష్టత ఇస్తామన్నారు. సీఎంఆర్ఎఫ్‌పై ఇంటర్నల్ ఆడిట్ జరుగుతోందని%ా% ఆ తర్వాత చర్యలు ఉంటాయన్నారు. తమ పరిపాలనే రిఫరెండంగా లోక్ సభ ఎన్నికలకు వెళతామన్నారు.

17కు గాను 14 లోక్ సభ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ట్యాక్స్ పేయర్స్‌కు రైతుబంధు ఎందుకు అని ప్రశ్నించారు. వ్యవసాయం చేసే వారికి మాత్రమే రైతుబంధు ఉండాలన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

**ప్రభుత్వం ఎందుకు పడిపోతుంది?**

తమ ప్రభుత్వం పడిపోతుందని చెప్పేవారు అలా ఎందుకు పడిపోతుందో చెప్పాలని నిలదీశారు. అసెంబ్లీకి రాని నేత ప్రతిపక్ష నేత ఎలా అవుతారు? అని ప్రశ్నించారు. ప్రధాని అంటే దేశానికి పెద్దన్న అనేది వాస్తవమే కదా అని రేవంత్



రెడ్డి వ్యాఖ్యానించారు. తాను కాళేశ్వరంపై నాలుగు వారాల్లో నివేదిక ఇస్తే ఎన్నికల లోపే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి నిర్మించి ఆదిలాబాద్‌కు నీళ్లు తెస్తామన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అంతర్గత ఒప్పందంతో టిక్కెట్లను ప్రకటిస్తున్నాయని ఆరోపించారు. మెదక్‌లో బీఆర్ఎస్ తమ అభ్యర్థిని ఎందుకు ప్రకటించలేదు? అని నిలదీశారు.

# సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన చేవెళ్ల బిఆర్ఎస్ ఎమ్మెల్యే



**హైదరాబాద్ మార్చి, 5 :** చేవెళ్ల బిఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ కు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. తన నియోజకవర్గం అభివృద్ధిపై సీఎం రేవంత్ తో ఆయన చర్చించినట్లు తెలుస్తోంది. ఇటీవల భద్రాచలం బిఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రేవంత్ రెడ్డిని కుటుంబ సమేతంగా కలిశారు. వీరితోపాటు సీఎం రేవంత్ ను కలిసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో సునితా లక్ష్మారెడ్డి, మాణిక్ రావు, గూడెం మహిపాల్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్ లు ఉన్నారు. దీంతో వీరంతా బిఆర్ఎస్ రాజీనామా చేసి త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు ప్రచారం కూడా జరుగిన సంగతి తెలిసిందే.

### పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలకు...

# 9 సీట్లు ఇవ్వాలి

**: ఆర్. కృష్ణయ్య**



**హైదరాబాద్ మార్చి, 5 :** రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిసిలకు 9 సీట్లు ఇవ్వాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్. కృష్ణయ్య అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జాతీయ బిసి యువజన సంఘం అధ్యక్షులు గవ్వల భరత్ కుమార్, గుజ్జ కృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్. కృష్ణయ్య ముఖ్యాతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, ఉత్తర ప్రదేశ్, బిహార్ లలో సంఘం రాష్ట్ర కమిటీలు వెయ్యడం జరిగిందని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు బిసిలకు చాలా తక్కువ సీట్లు ఇచ్చారని, అధికార పార్టీ – ప్రతిపక్ష పార్టీల మధ్య హోరాహోరీ పోరు ఉన్నందున గెలుపు గుర్రాలు, ఆర్థిక బలం అంటూ బిసి అభ్యర్థులకు అన్యాయం చేశారని ఆయన విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు బలంగా ఉన్నాయని, బిజెపి కేంద్రంలో అధికారంలో ఉందని, ఈ మూడు పార్టీలు బిసిలకు టికెట్లు ఇస్తే గెలిపించుకుంటామని కృష్ణయ్య అన్నారు. రూ. 47 కోట్ల 65లక్షల 768 కోట్ల కేంద్ర బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి బిక్షం ఇచ్చినట్లుగా కేవలం రూ. 2,150 కోట్లు కేటాయించి బిసిలకు అన్యాయం చేశారని విమర్శించారు. బిసిల విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి ఎలాంటి పథకాలు కాని కేటాయింపులు కాని లేవని విమర్శించారు. కేంద్రీయ విద్యా సంస్థలలో లక్షలాది బిసిలు చదువుకుంటున్నా వారికి ఫీజు రియింబర్స్‌మెంట్ లేదని, స్కాలర్ షిప్ ఇవ్వడం లేదని, హాస్టళ్ళు లేవని తెలిపారు. లక్షలాది రూపాయల ఫీజులు, మెయింటనెన్సు చార్జీలు కట్టలేక అత్యంత వెనుకబడిన కులాలకు చెందిన విద్యార్థులు చదువు మానేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# లోక్‌సభ ఎన్నికల్లో బిఎస్పీ, బిఆర్ఎస్ పొత్తు: ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్



**హైదరాబాద్ మార్చి, 5 :** త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బిఎస్పీ, బిఆర్ఎస్ పార్టీల మధ్య పొత్తు కుదిరినట్లు బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని కెసిఆర్ నివాసానికి వెళ్లిన ఆయన పొత్తులపై చర్చలు జరిపారు. అనంతరం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌తో కలిసి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో బిఎస్పీ, బిఆర్ఎస్ పార్టీలు కలిసి పోటీ చేయాలని సంయుక్తంగా నిర్ణయించారు. బిఎస్పీ, బీఆర్ఎస్ పార్టీలు పోటీ చేసే స్థానాలపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా పొత్తుతోపాటు పలు విషయాలపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్నట్లు ఆర్ఎస్పి, కెసిఆర్ చెప్పారు. ఎన్నికల్లో బిఎస్పితో పొత్తు ఉంటుందని కెసిఆర్ స్పష్టం చేశారు. త్వరలో పొత్తుపై విధివిధానాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు. కాగా, పొత్తులో భాగంగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి ఆర్ఎస్పి పోటీ చేయనున్నట్లు సమాచారం. మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భేటీ అయ్యారు.

### జై శ్రీరామ్ అని నినదించండి..

# తరువాత ఆకలితో చావండి



భోపాల్ : దేశంలో నిరుద్యోగితపై ప్రధాని నరేంద్ర మోడీని కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ మంగళవారం తీవ్రంగా విమర్శించారు. 'జై శ్రీరామ్ అని నినదించండి' అని దేశ ప్రజలను కోరే ప్రధాని వారు 'ఆకలితో చావాల'ని అనుకుంటుంటారని రాహుల్ ఆక్షేపించారు. మధ్య ప్రదేశ్‌లోని సారంగ్‌పూర్ నుంచి మంగళవారం తన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' తిరిగి మొదలైనప్పుడు రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇది ఇలా ఉండగా, బిజెపి కార్యకర్తలు 'మోడీ, మోడీ', 'జై శ్రీరామ్' నినాదాలతో రాహుల్‌కు స్వాగతం పలికారు. వారు ఆయనకు బంగాళాదుంపలను కూడా ఇవ్వజూపి, అందుకు ప్రతిగా తమకు బం గారం ఇవ్వాలని కోరారు. బిజెపి కార్యకర్తల నినాదాలను స్వాగతించిన రాహుల్ నిరుద్యోగితపై ప్రధాని తీరును విమర్శించారు. నిరుద్యోగులైన యువజనులు 'రోజు అంతా (సోషల్ మీడియాలో) రీల్స్ చూస్తుంటారు' అని రాహుల్ తెలిపారు. 'మీరు ఫోన్లు చూస్తుండాలని, జై శ్రీరామ్ అని నినదించాలని, ఆ తరువాత ఆకలితో చావాలని ప్రధాని కోరుతుంటారు' అని రాహుల్ ఆరోపించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ అగ్నివీర్ పథకం గురించి రాహుల్ ప్రస్తావిస్తూ, 'ఇంతకుముందు సాయుధ బలగాలు యువతకు రెండు గ్యారంటీలు ఇస్తుండేవి. వాటిలో ఒకటి యువతకు పింఛన్ ఇవ్వగలం, రెండవది వారు తమ ప్రాణాలు కోల్పోతే గౌరవం లభిస్తుంది' అని చెప్పారు. 'ఇప్పుడు అగ్నివీర్ పథకం అమలు జరుగుతోంది. దీని కింద నలుగురిని చేర్చుకుంటారు. ఆ నలుగురిలో ముగ్గురిని తొలగిస్తారు. ఆ ముగ్గురు ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు' అని రాహుల్ పేర్కొన్నారు.

### తెలంగాణలో...

# రూ.10 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు: కిషన్ రెడ్డి




**సంగారెడ్డి మార్చి, 5 :** కొత్త రైలు మార్గాలు, విద్యుద్దీకరణ, రైల్వే స్టేషన్లలో ఆధునీకరణ జరిగిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. బిజెపి విజయ సంకల్ప సభలో కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రసంగించారు. తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు కేంద్రం చేపట్టిందని స్పష్టం చేశారు. తెలంగాణలో కేంద్రం ఇప్పటివరకు పది లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందని తెలియజేశారు. కేంద్రం తెలంగాణకు ఏమీ ఇవ్వటం లేదని కొందరు ఆరోపణలు చేయడం మంచిది కాదని కిషన్ రెడ్డి హితువు పలికారు. బిఆర్ఎస్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, మార్పు వస్తుందనే ఆలోచనలో ప్రజలు ఉన్నారని, తెలంగాణలో ఏ రకమైన మార్పు కనిపించడంలేదని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. కెసిఆర్ కుటుంబం తెలంగాణను దోపిడీ చేసిందని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ ట్యాక్స్ పేరుతో వసూళ్లు చేపట్టారని, ఎంపి ఎన్నికల కోసం బిల్డర్లు, కాంట్రాక్టర్ల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు చేశారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల డిఎన్ఎ ఒక్కటేనని, రెండు పార్టీలకు ఎంఐఎం జత కలిసిందని, కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు తెలంగాణ తెలంగాణ ప్రజలను దోచుకుతిన్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నిజమైన మార్పు కోసం కుటుంబ పార్టీలకు చరమగీతం పాడాలని సూచించారు. బిఆర్ఎస్ కెటిఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని చూసిందని, కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బిజెపి ఒక్కటే ప్రజల కోసం పని చేసే పార్టీ అని, మరోసారి మోడీ హ్యాట్రిక్ ప్రధాని కాబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

## సంపాదకీయం

# కశ్మీరులో ఎవరైనా భూమి కొనవచ్చా....!

రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 ద్వారా జమ్మూకశ్మీరు రాష్ట్రానికి కల్పించిన ప్రత్యేక హెూదా, ఆర్టికల్ 35ఎ రద్దును సుప్రీం కోర్టు సమర్ధించింది. డిసెంబరు పన్నెండవ తేదీన ఇచ్చిన తీర్పు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యకు ఆమోదం తెలిపింది. అది తాత్కాలికమే గనుక రద్దు సబబే అన్నది. తీర్పు ఇచ్చిన కోర్టు, న్యాయమూర్తులకు దురుద్దేశాలను ఆపాదించకూడదు. తీర్పులపై అభిప్రాయం చెప్పే హక్కు ఉంది గనుక ఆ మేరకు అనేక మంది అనుకూలంగా, వ్యతిరేకంగానూ స్పందిస్తున్నారు. భిన్న అభిప్రాయం చెప్పడం దేశద్రోహం లేదా ఉన్నత న్యాయస్థానాన్ని ధిక్కరించడం కాదు. ఈ తీర్పుతో రాష్ట్రంలోని ఒక తరగతి జనం సంతోషించరు అని కశ్మీరు మాజీ రాజు హరిసింగ్ కుమారుడు, కేంద్ర మంత్రిగా పని చేసిన కాంగ్రెస్ నేత కరణ్ సింగ్ స్పందించారు. తీర్పుతో ఆశాభంగం చెందాం తప్ప నిరుత్సాహపడటం లేదని మాజీ సిఎం ఒమర్ అబ్దుల్లా చెప్పారు. కాంగ్రెస్ నుంచి వెలుపలికి వచ్చి బిజెపికి దగ్గరగా ఉంటున్న గులాం నబీ అజాద్ కూడా ఆశాభంగం చెందినట్లు ప్రకటించారు. తీర్పు వెలువరిస్తున్న సందర్భంగా కశ్మీరు లోయలో ఆర్టికల్ రద్దును వ్యతిరేకించిన రాజకీయ పార్టీలకు చెందిన వారిని పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. ఆ వార్తలను సహజంగానే ప్రభుత్వం కొట్టిపడవేసింది. కోర్టు తీర్పును ఆమోదించడం తప్పనిసరి అంటూ దీనికి వ్యతిరేకంగా అనవసరంగా గోడకేసి తలలను కొట్టుకోవాల్సిన పని లేదు. వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు శక్తిని సమీకరించుకోవాలని కరణ్ సింగ్ సలహా ఇచ్చారు. ఆర్టికల్ 370 వలన దేశంలోని ఇతర ప్రాంతాల వారెవరూ అక్కడ ఉండటానికి, భూములు కొనుక్కొనేందుకు అవకాశం లేదని, కశ్మీరు వేరే దేశం అన్నట్లుగా ఉందని రకరకాల ప్రచారాలు చేశారు. కాళిదాసు కవిత్వానికి తమ పైత్యాలను జోడించారు. కశ్మీరుకు ప్రత్యేక హెూదా తొలగించిన గత నాలుగున్నర సంవత్సరాలలో జరిగిందేమిటి? వాటిలో కొన్నింటిని చూద్దాం. ఆర్టికల్ 370 రద్దు చేసిన తరువాత 'నూతన కశ్మీరు' ఎంతో అభివృద్ధి చెందిందని ప్రచారం చేస్తున్నారు. 201819 కశ్మీరు రాష్ట్ర ఆర్థిక సర్వే నివేదిక ప్రకారం మానవాభివృద్ధి రంగాల్లో గుజరాత్ కంటే ముందున్నట్లు పేర్కొన్నారు. అంటే ఇప్పుడు ఇంకా జరిగిందని చెబుతున్నట్లా? 2019 జూన్‌లో ఎకనమిక్ టైమ్‌సు ప్రచురించిన వార్త ప్రకారం 1529 సంవత్సరాల వారిలో నిరుద్యోగం 15.89 శాతం ఉంది. రాష్ట్రాన్ని కేంద్రం స్వాధీనం చేసుకున్న తరువాత 2020లో 17.8% ఉన్నట్లు లేబర్ సర్వేలో తేలింది. ఇక తాజా సమాచారం ప్రకారం 18.3% ఉందని కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ పార్లమెంటులో చెప్పినట్లు హిందూస్తాన్ టైమ్‌సు పత్రిక 2023 జూలై 26న ప్రచురించింది. కేంద్ర పాలనలో సాధారణ పరిస్థితి ఏర్పడిందని, ఉపాధి పెరిగిందని చేస్తున్న ప్రచారానికి పొంతన కనిపించటంలేదు. ఉగ్రవాదులు చెలరేగుతూనే వున్నారు. ఆ కారణంగానే రాష్ట్ర ప్రతిపత్తిని ఇంకా పునరుద్ధరించలేదు. ఆర్టికల్ 370కు అనుబంధంగా రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా 1954 లో రాజ్యాంగానికి ఆర్టికల్ 35ఎ తోడైంది. అనేక రాష్ట్రాలలో కల్పించిన మాదిరి కశ్మీరులో వున్న శాశ్వత నివాసులకు కొన్ని ప్రత్యేక అవకాశాలు, హక్కులను ఇది కల్పించింది. రాష్ట్రం వెలుపల ఉన్న వారికి స్థిర ఆస్తులను కొనుగోలు చేసేందుకు అవకాశం లేదు. ఎవరు శాశ్వత నివాసులన్న నిర్వచనాన్ని మూడింట రెండువంతుల మెజారిటీతో రాష్ట్ర అసెంబ్లీ మాత్రమే మార్చగలదు. ఈ ఆర్టికల్ వలన దేశంలోని ఇతరులు కశ్మీరులో రెండవ తరగతి పౌరులుగా పరిగణించబడుతున్నట్లు, ఇది పౌరుల మౌలిక హక్కులకే విరుద్ధం అని రాష్ట్రం వెలుపలి వారిని వివాహం చేసుకున్న కశ్మీరీ మహిళకు జన్మించిన సంతానానికి కూడా ఆస్తిహక్కు ఉండదని ఇది వివక్ష కాదా అని కొందరు భాష్యం చెప్పారు. నిజానికి కశ్మీరు శాశ్వత నివాసుల గురించి 1927లోనే నాటి రాజు హరిసింగ్ ఉత్తర్వులు జారీచేశారు. విలీనం సందర్భంగా వాటికి హామీ ఇచ్చినందున రాజ్యాంగంలో పొందుపరచినట్లు సమర్ధకులు చెబుతున్నారు. కొన్ని ప్రత్యేక హక్కులు మరికొన్ని ఇతర రాష్ట్రాలలో కూడా ఉన్నాయని వాటి సంగతేమిటని ప్రశ్నిస్తున్నారు. తాజాగా సవరించిన దాని ప్రకారం కశ్మీరులో స్థానికత నిర్ధారణకు నిబంధనలు ఇలా ఉన్నాయి. పదిహేను సంవత్సరాలు కశ్మీరులో నివసించిన వారు, రాష్ట్రంలో ఏడు సంవత్సరాల పాటు చదివి పది లేదా పన్నెండవ తరగతి పరీక్షకు హాజరైన వారు వలస వచ్చినట్లు పునరావాస, సహాయ కమిషనర్ వద్ద నమోదు చేయించుకున్నవారు, పదేండ్లకు పైగా కశ్మీరులో పని చేసిన ఆలిండియా సర్వీసు అధికారులు, ప్రభుత్వ రంగ సంస్థలు, బాంకులు, పరిశోధనా సంస్థలు, చట్టబద్ధ ఇతర సంస్థలలో వారు పని చేసినా స్థానికులుగా పరిగణించబడతారు. అలాంటి వారి పిల్లలు రాష్ట్రం వెలుపల ఉపాధి, వాణిజ్యం వంటి వాటి కోసం ఉంటే వారినీ స్థానికులుగా పరిగణిస్తారు. ఒకే దేశం, పౌరులంతా సమానమే అని చెప్పినప్పటికీ కొన్ని రాష్ట్రాలలో వెలుపలి వారు భూములు కొనేందుకు వీలు లేదు.

## ప్రజాపాలన దరఖాస్తుదారుల వివరాలు తప్పులకు తావివ్వకుండా అర్హులందరికీ లబ్ధి చేకూరేలా నమోదు చేసేలా చర్యలు





**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త):** ప్రజా పాలన సేవ కేంద్రాల ద్వారా గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల ఎంపిక కొరకు అవసరమైన డాక్యుమెంట్లు సేకరించి ప్రజాపాలన సాఫ్ట్ వేర్ లో నమోదు చేయాలని విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం రిజ్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుండి విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం రిజ్వి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటు,సాఫ్ట్ వేర్ లో వివరాల నమోదు పై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన లో భాగంగా గృహాజ్యోతి, మహాలక్ష్మి పథకాల ఆన్లైన్ ప్రక్రియలో ఏవైనా లోపాలు ఉంటె వాటిని సవరించి అర్హులకు లబ్ది చేకూర్చాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేటులోని వి సి హాల్ లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య తో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ గృహలక్ష్మి, మహాలక్ష్మి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్లైన్లో తప్పులు లేకుండా సరి చేసి అర్హులకు లబ్ది చేకూర్చాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓల ను ఆదేశించారు. ఇదివరకే ఏర్పాటు చేసిన ప్రజా పాలనా సేవ కేంద్రాల వద్దనే ఈ ప్రక్రియను కొనసాగించాలన్నారు. ఆన్లైన్ లో అభ్యర్థి ఆధార్ నంబర్, కరెంట్ బిల్ యు ఎస్ సి నెంబర్, గ్యాస్ కనెక్షన్ కస్టమర్ ఐ డి, కన్స్యూమర్ ఐ డి లను క్రాస్ చెక్ చేసి సవరించిన కరెక్షన్ లను రిజిస్టర్ నందు తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. దరఖాస్తు దారులు అధిక సంఖ్యలో ఉన్న చోట ఎండ తీవ్రంగా ఉన్నందున త్రాగునీరు, షామియానాలు వేసి నీడ ఉండేలా చూడాలన్నారు. బోడుప్పల్, నిజాంపెట్, జవహర్ నగర్ లలో అధిక సంఖ్యలో దరఖాస్తు దారులు ఉంటారని అవసరమైతే 2 లేదా 3కంప్యూటర్లను, ఆపరేటర్లను అందుబాటులో ఉంచాలని, రద్దీగా ఉన్న చోట ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు దగ్గరుండి పరిశీలించాలన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం





**శామీర్ పేట, (గరుడ వార్త):** శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఘనంగా అన్నదానం జరిగింది. మంగళవారం మండల కేంద్రం శామీర్ పేటలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్ పేటకు చెందిన డప్పు రామస్వామి-భారతమ్మ దంపతులు 50 కేజీల బియ్యం, డప్పు అరుణ్ కుమార్-మాధవి దంపతులు రూ.2000, దేశం శ్రీనివాస్ గౌడ్- రమ్య దంపతులు రూ.1116, డిజి వెంకటేష్ గౌడ్-దుర్గాభవాని దంపతులు రూ. 1100, బత్తిని వెంకటేష్ గౌడ్-సౌందర్య దంపతులు, బత్తిని శ్రీనివాస్ గౌడ్-వైష్ణవి దంపతులు, బత్తిని మల్లేష్ గౌడ్-శిరీష దంపతులు రూ.3000, దూడల వెంకటేష్ గౌడ్-ప్రసన్న దంపతులు కూరగాయలు, బత్తిని భాస్కర్ గౌడ్-చైతన్య దంపతులు రూ .501, దేశం సత్యనారాయణ గౌడ్-రాణి దంపతుల రూ.500, దేశం మురళి గౌడ్-నాగలక్ష్మి దంపతులు రూ.500, దండ బోయిన నర్సింగరావు ముదిరాజ్-లక్ష్మి దంపతులు రూ .500 అందజేయగా ఆలయ కమిటీ తరపున అన్నదానం చేశారు. తుంకుంట చెందిన కాలం సోమేశ్వర్ రావు-రజిని దంపతులు స్వీటును అమ్మవారికి సమర్పించి భక్తులకు అందజేశారు. ఉమ్మడి శామీర్ పేట మండలంకు చెందిన భక్తులు, రాజీవ్ రహదారిపై వెళ్లే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

## సమాజ సేవలకు గుర్తింపుగా కళారి సంతోష్ కుమార్ డాక్టరేట్



**శామీర్ పేట (గరుడ వార్త):** సమాజ సేవ చేయాలనే తపన ఉంటే చాలు నాయకులే కాదు ఉద్యోగస్తులు సైతం చేయగలరని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగి సంతోష్ కుమార్ నిరూపించారు. రోడ్డు రవాణా సంస్థ హకీంపేట్ డిపో ఉద్యోగి (కండక్టర్)కి దక్కిన అరుదైన గౌరవం.సమాజంలో తన వంతు బాధ్యతగా తాను చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో గ్లోబల్ హుమన్ రైట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన డాక్టరేట్ ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారు.ఎమ్మెల్యే మాల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ స్వచంద సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు వినియోగించుకోవాలని దీనిపై ప్రజల్లో చైతన్యం రావాలని ప్రభుత్వ ప్రయివేటు సంస్థలు తమ తమ రంగాలలో కార్మికులకు, ఉద్యోగులకు వారు తమ రంగాలలో అభివృద్ధి శిక్షణా,కార్యక్రమాలుతో పాటు ఇలాంటి లైఫ్ సేవింగ్ స్కిల్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కళారి సంతోష్ కుమార్ రోడ్డు ప్రమాదాల నివారణ అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స, సిపిఆర్, అంశముల పైన అనేక ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ఎంతో మంది విద్యార్థులకు 2008 నుండి అనేక అవగాహన శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీని ద్వారా ప్రజల విలువయిన ప్రాణాలు కోల్పోకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన చర్యలపై, జాగ్రత్తలపై ఆయన దృష్టి సారించారు. వారి సేవలను గుర్తించి గ్లోబల్ హూమన్ రైట్స్ ట్రస్ట్ సంస్థ ద్వారా హూమన్ సర్వీస్, విద్యా, టీచింగ్, ట్రైనింగ్, శిక్షణా తరగతులు, కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ డాక్టరేట్ అందుకోవడం సంతోషంగా ఉందని తనపై మరింత బాధ్యత పెరిగిందని సమాజ సేవ అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కళారి సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఇంచార్జీ రేణుకా లింగాల, జాతీయ అధ్యక్షులు రెహమాన్ ఇతర సభ్యులు, అవార్డు గ్రహీతలు, తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



**శామీర్ పేట(గరుడ వార్త) :** నూతనంగా నియమితులైన మూడు చింతలపల్లి తహసిల్దార్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు. ఇటీవల బదిలీపై మూడుచింతలపల్లి మండలానికి వచ్చిన తహసిల్దార్ వెంకట నరసింహారెడ్డిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకలను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, మండల ఉపాధ్యక్షుడు మెర్పటి గోవర్ధన్ రెడ్డి, ఉద్దమర్రి గ్రామ మాజీ సర్పంచ్ అనురాధ రవీందర్ రెడ్డి, నాయకులు నవీన్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయాధికారుల సూచనలు సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు అదేవిధంగా రాబడులు కూడా పొందుతారని రాజేంద్రనగర్ రైతు శిక్షణ కేంద్రం ఏవో కృష్ణవేణి తెలిపారు. మంగళవారం శామీర్ పేట మండలం లాల్ గడి మలక్ పేట గ్రామంలో వరి పంటల తెగుళ్ల నివారణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు సాధిస్తారని తెలిపారు. ప్రస్తుతం వరి పైరు పై మొగి పురుగు కనిపిస్తుందని, పంటలలో జింకులోపం ఉందన్నారు. జింకులోప నివారణకు జింక్ చిలామిన్ 500 గ్రాములు ఎకరానికి వేయాలన్నారు. మొగి పురుగు నివారణకు క్లోరంత్ర నిలిప్రోలు గుళికలు 4 కిలోలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 8 కిలోలు వాడుకోవాలని సూచించారు. యూరియాను దఫాల వారీగా పైరుపై చల్లుకోవాలని తెలిపారు. అవగాహన నిర్వహించడంతోపాటు రైతుల పొలాల్లో క్షేత్రస్థాయిలో పైరులను పరిశీలించి సూచనలు, సలహాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట వ్యవసాయ అధికారి రమేష్, వ్యవసాయ విస్తరణాధికారి సరోజ, రైతులు హరిశంకర్, ప్రభాకర్ రెడ్డి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐ ద్వారా మోడీ సర్కార్ కొత్త నాటకం: ఖర్గే ఫైర్



న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయడానికి మరి కొంత వ్యవధి కావాలంటూ భారతీయ స్టేట్ బ్యాంకు(ఎస్‌బిఐ) సుప్రీంకోర్టును ఆశ్రయించడంపై కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా దుయ్యబట్టింది. తన అక్రమ లావాదేవీలను కప్పిపుచ్చుకోవడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎస్‌బిఐని రక్షణ కవచంగా వాడుకుంటోందని కాంగ్రెస్ ఆరోపించింది. రాజకీయ పార్టీలు నగదు రూపంలో మార్చుకున్న ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించడానికి తమకు జూన్ 30 వరకు గడువు ఇవ్వాలని కోరుతూ ఎస్‌బిఐ సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గత నెలలో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు మార్చి 6వ తేదీలోగా ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని ఎస్‌బిఐని ఆదేశించింది.

ఎన్నికల బాండ్ల పథకం అక్రమం, అప్రజాస్వామికం, రాజకీయ పార్టీలకు సమన్యాయం లేకుండా చేయడంగా కాంగ్రెస్ మొదటి నుంచి భావిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. ఎన్నికల బాండ్ల ద్వారా గాసింగిచన తన అక్రమ లావాదేవీలను కప్పిపుచ్చడానికి దేశంలోని అతి పెద్ద బ్యాంకును రక్షణ కవచంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వాడుకుంటోందని ఖర్గే ఆరోపించారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని నల్ల ధనం మార్పిడి పథకంగా మోడీ ప్రభుత్వం మార్చుకుందని, ఈ ర్యాంగ వ్యతిరేక, ఆర్‌టిఐ వ్యతిరేక, చట్టవిర్ధు పథకాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసిందని ఆయన తెలిపారు. మార్చి 6వ తేదీ లోగా ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలని స్వయానా సుప్రీంకోర్టే ఎస్‌బిఐని ఆదేశించిందని ఆయన గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత దీని సంగతి చూడాలని బిజెపి భావిస్తోందని ఆయన అన్నారు. జూన్ 16న ప్రస్తుత లోక్‌సభ కాల పరిమితి ముగుస్తుందని, జూన్ 30న వివరాలు బహిర్గతం చేస్తామని ఎస్‌బిఐ చెబుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మోసపూరిత పథకాని ద్వారా అధికంగా ప్రయోజనం పొందింది బిజెపియోనని ఆయన అన్నారు. ఎన్నికల బాండ్లను ద్వారా లబ్ధి పొంది అందుకు ప్రతిఫలంగా హైవేలు, రేవులు, విమానాశ్రయాలు, విద్యుత్ ప్లాంట్లు తదితర భారీ కాంట్రాక్టులను ప్రధాని మోడీ అనుయాయులకు కట్టబెట్టారని, బిజెపి సాగించిన ఈ అక్రమ లావాదేవీలను దాచిపెట్టేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది నిజం కాదా అని ఖర్గే ప్రశ్నించారు. 44,434 టోమోటెడ్ డాటా ఎంట్రీలను 24 గంటల్లో వెలికితీసి సరిపోలవచ్చని నిపుణులు చెబుతున్నారని ఆయన తెలిపారు. మరి ఎస్‌బిఐకి మరో 4 నెలల సమయం ఎందుకు అవసరమని ఆయన ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం, పిఎంఓ దేశంలోని ఆర్‌బిఐ, ఎన్నికల కమిషన్, పార్లమెంట్, ప్రతిపక్షం వంటి అన్ని వ్యవస్థలను బిజెపి ఖజానా నింపేందుకు ధ్వంసం చేశాయని ఆయన ఆరోపించారు. కాగా..కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎస్‌బిఐఇ విజ్ఞప్తికి అనుమతించవద్దని ఆయన సుప్రీంకోర్టును కోరారు. ఎన్నికల బాండ్లపై తన యంత్రాంగంతో ఎస్‌బిఐ అధికారులు తప్పించుకుని వెళ్లడానికి సుప్రీంకోర్టు అనుమతించరాదని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల బాండ్ల దాతల పేర్లు బయటకు రావాలని ఆయన డిమాండ్ చేశారు.

గరుడ వార్త
బుధవారం, మార్చి 06, 2024

# షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించండి: బెంగాల్ హైకోర్టు ఆదేశాలు



కోల్‌కతా : సందేశ్ ఖాళీలో ఇటీవల ఈడీ అధికారులపై జరిగిన దాడి కేసును కలకత్తా హైకోర్టు కేంద్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ బలమైన నాయకుడు షాజహాన్ షేక్‌ను కూడా సీబీఐ కస్టడీకి అప్పగించాలని బెంగాల్ పోలీస్‌లను న్యాయస్థానం ఆదేశించింది. రేషన్ బియ్యం కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న షాజహాన్ షేక్ ఇంట్లో తనిఖీల కోసం వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బృందంపై ఆయన అనుచరులు జనవరి 5న దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటన తరువాత ఆయన పరారయ్యారు. ఈ నేపథ్యంలో షాజహాన్‌పై అత్యాచార ఆరోపణలు చేస్తూ సందేశ్ ఖాళీ మహిళలు సాగించిన ఆందోళన దుమారం రేపింది. తీవ్ర వివాదాస్పదంగా మారిన ఈ కేసును హైకోర్టు తీవ్రంగా పరిగణించడంతో చివరకు ఫిబ్రవరి 29న ఆయనను పోలీస్‌లు అరెస్టు చేశారు. అయితే ఈడీ అధికారులపై దాడి కేసులో దర్యాప్తుకు సీబీఐ, రాష్ట్ర పోలీస్‌ల సంయుక్త సిట్‌ను ఏర్పాటు చేయాలని హైకోర్టు జనవరి 17న తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ ఈడీ, బెంగాల్ ప్రభుత్వం విడివిడిగా పిటిషన్లు దాఖలు చేశాయి. దర్యాప్తును పూర్తిగా సిబిఐకి అప్పగించాలని ఈడీ కోరగా, రాష్ట్ర పోలీస్‌లకే ఇవ్వాలని టీఎంసీ ప్రభుత్వం అభ్యర్థించింది. దీనిపై కలకత్తా హైకోర్టు విచారణ జరిపి, దర్యాప్తును సిబిఐకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# మే 10 తర్వాత మాల్దీవుల్లో భారత సైనికులు ఉండొద్దు



మాలె: తన భారత వ్యతిరేక వైఖరిని మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు మరోసారి బయటపెట్టారు. మే 10వ తేదీ తర్వాత సివిలియన్ దుస్తులలో ఉన్నవారితో సహా భారత సైనిక సిబ్బంది ఎవరూ తమ దేశంలో ఉండడానికి వీల్లేదని ఆయన ప్రకటించినట్లు మంగళవారం మీడియా కథనాలు తెలిపాయి. భారత సైనిక సిబ్బంది ఉపసంహరణపై రెండు దేశాల మధ్య మార్చి 10వ తేదీ గడువుపై అంగీకారం కుదిరిన నేపథ్యంలో మాల్దీవులలోని తమ మూడు ఏవియేషన్ ప్లాట్‌ఫారాలలో ఒకదాన్ని అధీనంలోకి తీసుకునేందుకు భారతీయ సివిలియన్ బృందం గత వారం మాల్దీవులను చేరుకుంది. ఈ పరిణామం నేపథ్యంలో అధ్యక్షుడి నుండి ఈ రకమైన ప్రకటన విడుదల కావడం గమనార్హం. భారత దళాలను దేశం నుంచి వెళ్లగొట్టడంలో విజయం సాధించిన తమ ప్రభుత్వంపై కొందరు తప్పుడు వదంతులు వ్యాప్తి చేస్తూ పరిస్థితిని వక్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారని అధ్యక్షుడు ముయిజ్జు తెలిపారు. అయితే వీరు(భారత సైనికులు) దేశాన్ని వదిలి వెళ్లడం లేదని, తమ యూనిఫారాలను సివిలియన్ దుస్తులలోకి మార్చుకుని ఇక్కడకే తిరిగివస్తున్నారని ఆయన అన్నారు. మే 10 తర్వాత దేశంలో భారత సైనికులు ఎవరూ యూనిఫారాలలో కాని సివిలియన్ దుస్తులలో కాని ఉండడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. ఏ రకమైన దుస్తులు ధరించి భారత సైన్యం ఇక్కడ నివసించడానికి వీల్లేదని ఆయన చెప్పారు. ఇది తాను ఆత్మ విశ్వాసంతో ప్రకటిస్తున్నానని ఆయన చెప్పారు. మాల్దీవులలో మూడు భారతీయ ప్లాట్‌ఫారాలను నిర్వహించడానికి 38 మంది సైనిక సిబ్బంది పనిచేస్తున్నారు. గత కొన్ని సవంత్సరాలుగా రెండు హెలికాప్టర్లు, ఒక డార్నియర్ విమానం ద్వారా మాల్దీవులకు చెందిన ప్రజలకు మానవత, వైద్య తరలింపు సేవలను భారత సైనిక సిబ్బంది అందచేస్తున్నారు.

# నీటిని వేస్ట్ చేస్తే రూ.5వేలు ఫైన్..

## బెంగళూరు హౌసింగ్ సొసైటీ కీలక నిర్ణయం



సిలికాన్ సిటీ ఆఫ్ ఇండియాగా పేరున్న కర్ణాటక రాజధాని బెంగళూరులో తాగునీటి సంక్షోభం తీవ్రస్థాయికి చేరుకుంది. కాలనీలకు పదిరోజులకొకసారి కూడా నీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు నీటికోసం అల్లాడిపోతున్నారు. ఇక ప్రైవేట్ వాటర్ ట్యాంకర్స్ దోపిడితో సామాన్యులు బేంబేలెత్తిపోతున్నారు. నగరంలోని 25 శాతం మేర నీటి అవసరాలను తీరుస్తున్న నీటి ట్యాంకర్ల యజమానులు కూడా ధరలను అమాంతం పెంచేశారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఈ క్రమంలో తీవ్ర నీటి ఎద్దడి నేపథ్యంలో నగరంలోని ఓ హౌసింగ్ సొసైటీ కీలక నిర్ణయం తీసుకుంది. పామ్ మెడోస్ సొసైటీ తాగునీటిని దుర్వినియోగం చేసిన వారికి భారీ జరిమానా విధించాలని నిర్ణయించింది. నగరంలోని వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో ఈ హౌసింగ్ సొసైటీ ఉంటుంది. నగరంలో నీటి సంక్షోభంలో అత్యంత ప్రభావిత ప్రాంతాల్లో ఇదొకటి. దీంతో సొసైటీలో ఎవరైనా నీటిని వేస్ట్ చేస్తే ఏకంగా రూ.5,000 ఫైన్ విధించాలని నిర్ణయించింది. పరిస్థితిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక భద్రతా సిబ్బందిని కూడా నియమించింది. ఈ మేరకు సొసైటీలోని నివాసితులందరికీ నోటీసులు జారీ చేసింది. నాలుగు రోజులుగా బెంగళూరు నీటి సరఫరా నుంచి నీరు అందలేదని నోటీసుల్లో పేర్కొంది. త్వరలో భూగర్భ జలాలు క్షీణించే ప్రమాదం ఉన్నందున నీటిని ఎవరూ వృథా చేయకండి అని విజ్ఞప్తి చేసింది. గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు ప్రతి యూనిట్‌కు నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించాలని నిర్ణయించినట్లు తెలిపింది.

# దండకారణ్యంలో అప్రకటిత యుద్ధం...!



దేశ ప్రజల మీద భారత రాజ్యం ఆకాశ యుద్ధానికి దిగింది. నాలుగేళ్ల క్రితం నుంచే ఛత్తీస్‌గఢ్ ఆదివాసుల మీద అప్పుడు రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కలిసి హెలికాప్టర్లలో బాంబింగ్‌ను మొదలుపెట్టాయి. ఇప్పుడు రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఈ యుద్ధం తీవ్రమైంది. దండకారణ్యంలో జరుగుతున్న ఈ వైమానిక యుద్ధానికి వ్యతిరేకంగా ఆదివాసులు నాలుగేళ్లుగా నిరాయుధ పోరాటాన్ని నడుపుతున్నారు. దండకారణ్యంలో సహజ వనరులను కార్పొరేట్లకు ఇవ్వడానికి వ్యతిరేకంగా ఆదివాసీలు జరుపుతున్న పోరాటానికి పాటలను, కళారూపాలను అందించి సాంస్కృతిక రంగంలో పని చేయడానికి మూలవాసీ సాంస్కృతిక కళా మంచ్ ఏర్పడింది. ఈ సంస్థ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ హిందుత్వ విధానాలను, వాటికి వ్యతిరేకంగా సాగుతున్న ఛత్తీస్‌గఢ్ ఆదివాసుల పోరాటాలను, వాటి మీద జరుగుతున్న వైమానిక యుద్ధాన్ని సమాజానికి తెలియజేయడానికి పని చేస్తున్నది.

ఛత్తీస్‌గఢ్‌లో సైనికీకరణ రూపంలో జరుగుతున్న ఈ యుద్ధానికి కారణం కార్పొరేటీకరణ. రాష్ట్రంలో 26 రకాల విలువైన ఖనిజ సంపదలు వున్నాయి. ఇక్కడ ఇనుము, బొగ్గు, బాక్సైట్, డోలమైట్, క్రోమైట్, మెగ్నీషియం, సున్నపు రాళ్లు, సిలికాన్, గ్రానైట్, లిథియం లాంటివి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చేందుకు పథకాలు వేసుకొని అమలు చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో 31శాతం ఖనిజ సంపదలు, అటవీ సంపదలు ప్రభుత్వాలకు కోట్లాది ఆదాయాన్ని ఇస్తున్నాయి. కానీ ఈ ఆదాయాన్ని ఆదివాసీ ప్రజల మౌలిక అవసరాలకు కేటాయిస్తున్నది మాత్రం చాలా తక్కువ. దీన్ని అధికారంలో వున్న రాజకీయ నాయకులు, అధికారులు, కార్పొరేట్ కంపనీలు, సామ్రాజ్యవాదశక్తులు కలిసి దోచుకుంటున్నాయి. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లో విష్ణుదేవ్‌సాయి బీజేపీ అధికారంలోకి రావడంతో డబల్ ఇంజన్ బుల్డోజర్ సర్కార్ కార్పొరేట్లకు నమ్మకమైన సేవకురాలిగా, వాళ్లకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తున్నది. ఛత్తీస్‌గఢ్ బొగ్గుగనులను అదాని కంపెనీలకు ఇచ్చింది. ఐటిఐ ట్రైనింగ్ టాటా కంపెనీకి ఇచ్చింది. ఎన్‌ఎమ్‌డిసి బైలాడిల్లా కంపెనీని ప్రైవేటీకరణ చేసేందుకు తయారుగా వుంది. ఇందుకుగాను లక్షల కోట్ల రూపాయల ఒప్పందాలు జరగనున్నాయి. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఇప్పుడు వచ్చిన బీజేపీ ప్రభుత్వాలు గత నాలుగేళ్లుగా 104 ఎంఓయూలను చేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాల ప్రకారం ఆ కంపెనీలకు అన్నిరకాల సౌకర్యాలు త్వరగా పూర్తి చెయ్యాలి. కార్పొరేట్లకు అనేక రకాల సౌకర్యాలు కల్పించేందుకే బస్తర్‌లో సైనికీకరణ %--% ప్రైవేటీకరణలో భాగంగా ప్రభుత్వం ప్రజలపై యుద్ధం ప్రకటించింది. బస్తర్ సంబాగ్‌లో గత నాలుగేళ్ళుగా కొత్తగా నిర్మించే పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతంలో గ్రామ సభ అనుమతి లేకుండానే రాత్రికి రాత్రి పెద్దయెత్తున బలగాలు వచ్చి పోలీసు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రశ్నించే ప్రజల్ని పోరాడే ప్రజల్ని బూటకపు కేసులతో అరెస్టులు చేసి నక్సలైట్ కేసుల పేరుతో జైళ్లలో పెడుతున్నారు. ప్రజల్ని భయాందోళనలకు గురిచేసేలా బూటకపు ఎదురు కాల్పుల్లో ప్రజలను చంపేస్తున్నారు. ఇటీవల ఆరునెలల పసిపాపను కూడా హత్య చేశారు. 2021 ఏప్రిల్ 19న మొదటిసారిగా సుక్మా జిల్లాలోని పాలగూడెం, బొత్తిలంక, ఈతగూడెం గ్రామాల పరిసర అటవీ ప్రాంతంలో భారత సరిహద్దులో ఉపయోగించే డ్రోన్లతో బాంబులు వేశారు. రెండవసారి 2022 ఏప్రిల్ 14న సుక్మా జిల్లాలోని సాకిలేరు, చంద, ఇంకాల్, మెట్టగూడెం గ్రామాల మధ్య డ్రోన్లతో బాంబులు వేశారు. మూడవసారి 2023 జనవరి 11న ఇదే జిల్లాలోని బొట్టెం, ఎర్రం గ్రామాల మధ్య హెలికాప్టర్లలో వచ్చి విచ్చలవిడిగా కాల్పులు జరుపుతూ డ్రోన్లతో బాంబింగ్ చేసారు. ఈ దాడిలో ఒక మహిళ చనిపోయింది. మరికొందరు గాయపడ్డారు. నాల్గవసారి 2023 ఏప్రిల్ 7న సుక్మా%--%బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో మీనగట్ట, జబ్బాల్, కావుర్గట్ట, బొట్టెం, గుండం గ్రామాల మధ్య డ్రోన్ల ద్వారా పెద్ద ఎత్తున బాంబింగ్ చేస్తూ, మరొక వైపు హెలికాప్టర్లతో విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఈ దాడులన్నీ కేవలం ప్రజా గెరిల్లా విముక్తి సైన్యాన్ని లక్ష్యంగా చేసుకొని జరిగినవి కావు. ప్రజలను లక్ష్యంగా చేసుకొని జరిగిన దాడులే. 2024 ప్రారంభం నుండే కార్పెట్ సెక్యూరిటీ విస్తరణలో భాగంగా ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా వేలాది బలగాలను మోహరించి పదుల సంఖ్యలో కొత్తగా క్యాంపులు నిర్మాణం చేసారు. అందులో భాగంగా సుక్మా జిల్లాలోని దూలోడ్, మెట్టగూడెం గ్రామాల మధ్య క్యాంపు ఏర్పాటు చేసి జనవరి 13న రాకెట్ లాంచర్లతో దాని చుట్టుపక్కల ఉన్న గ్రామాలను, అడవులను లక్ష్యంగా చేసుకొని పెద్ద ఎత్తున దాడులు చేసారు. ఈ దాడుల్లో ప్రజలు చెల్లాచెదురై పరుగెత్తుతూ తమ ప్రాణాల్ని కాపాడుకున్నారు.

# మానవ సంబంధాలన్నీ ఆర్థికమేనా?

ఒకప్పుడు సమాజంలో ఎవరికైనా ఆపదవస్తే ఒకరికి ఒకరు తోడుగా ఉండేవారు. నేడు పరిస్థితులు మారిపోయాయి మనకెందుకులే అనుకునే సంస్కృతి సమాజంలో పెరిగిపోయింది. వ్యక్తి ఎంత సేపు ఆర్థిక సంబంధాలు కోసం మాత్రమే మానవ సంబంధాన్ని కొనసాగిస్తున్నారు.ప్రతిరోజు ఒకరితో మనం కలిసి ఉంటే మనకు వారు ఏ విధంగా ఉపయోగపడతారు అనే ఆలోచన సమాజంలో పెరిగిపోయింది. చివరికి కుటుంబ సభ్యుల అనుబంధాలు కూడా ఆర్థిక సంబంధాలుగా మారిపోవడం చాలా దురదృష్టం.

ఈ పరిణామం మానవ సంబంధాలపై చాలా ప్రభావం చూపుతుంది. బంధువుల్లో ఒకరు చనిపోతే వారి చుట్టాలు సోషల్ మీడియాలో శ్రద్ధాంజలి ఘటించారు. ప్రత్యక్షంగా వారి ఇంటికి వెళ్ళి ఓదార్చిన సందర్భం లేదు కనీసం ఫోన్‌లోనైనా పలకరించలేదు. అన్నదమ్ముల్లో ఒకరి పుట్టినరోజు ఇంకొకరు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. దగ్గరి స్నేహితుల్లో ఒకరి ఇంట్లో పెండ్లి ఉంది పెండ్లి కార్డు వాట్సప్ గ్రూప్‌లో పెట్టారు. రోజు కలిసే వారే కాని భౌతికంగా ఆహ్వానించలే. ఒకే కాలనీలో ఉండే వారిలో ఒకరికి ఆపద వచ్చింది వెంటనే సోషల్ మీడియాలో పెట్టారు. కాని సహాయం చేయడంలో వెనుకంజ, ఇదేమిటంటే సోషల్ మీడియాలో పెడితే ఎవరో ఒకరు సహాయం చేస్తారు అంటారు.



వారు మాత్రం చేయరట. మానవ సంబంధాలు, ఆప్యాయతలు, అనుబంధాలు ఇలా ఎందుకు మారాయి? ఒకే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు పలకరింతలు మాని వాట్సాప్ సందేశాలు పంపుకోడం దేనికి సంకేతం? వీళ్ళందరితో మాట్లాడితే సోషల్ మీడియాలో పెట్టాం కదా అంతకన్నా ఏం చేస్తాం మరి అనడం ద్వారా మానవ సంబంధాలకి వారు ఇస్తున్న విలువేంటి? ఉమ్మడి కుటుంబాల్లో కుటుంబ సభ్యులందరూ కలిసి ఉండేవారు. ఆ కుటుంబంలో ఉండే పెద్దవారు కుటుంబ సభ్యులకు తెలియకుండానే వ్యక్తిత్వ వికాస బోధన చేసేవారు. వారి ప్రవర్తన చూసి పిల్లలు నేర్చుకునే వారు. భవిష్యత్తులో సమాజంలో ఏ విధంగా ఉంటే మంచి పౌరులుగా తీర్చిదిద్దబడతారో వారికి దిశనిర్దేశం చేసేవారు. నేటి ఆధునిక యుగంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగయ్యాయి. న్యూక్లియర్ ఫ్యామిలీస్ ఏర్పడ్డాయి. ఈ కేంద్రక కుటుంబాలలో వ్యక్తిగత స్వార్థాలు పెరిగాయి. సమాజంలోని మిగతా కుటుంబాలతో సంబంధాలు, అనుబంధాలు తగ్గిపోయాయి. గతంలో కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితులు కలిసినప్పుడు మనస్ఫూర్తిగా వారి అనుభవాలను పంచుకుంటూ భవిష్యత్‌కి బాటలు వేసుకుంటూ ఆనందంగా, సంతోషంగా గడిపేవారు. నేడు పూర్తిగా పరిస్థితులు మారిపోయాయి. అందరూ కలిసినప్పుడు భౌతికంగా మాట్లాడుకోకుండా స్మార్ట్ ఫోన్లను వినియోగిస్తూ విలువైన కాలాన్ని సోషల్ మీడియాలో దుర్వినియోగం చేస్తూ అనుబంధాలకు, ఆప్యాయతలకు దూరమవుతున్నారు. ఆధునిక ప్రపంచంలో మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారడానికి ప్రధాన కారణాలు తను మాత్రమే ఎదగాలని వ్యక్తిగత స్వార్థం, సామాజిక స్పృహ లోపించడం, సోషల్ మీడియా, ఉమ్మడి కుటుంబాలకు దూరంగా ఉండడం మొదలగునవి. ఆరోగ్యకరమైన వాతావరణంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే సంభాషణల వల్ల వారిద్దరి మధ్య మానవ సంబంధాలు బలపడే అవకాశాలు ఉన్నాయి. సోషల్ మీడియా ప్రభావానికిలోనై ప్రజలు భౌతికంగా సంభాషించడం మానేసి చాలా రోజులైంది. వారి హావభావాలకు వేదికగా సోషల్ మీడియాను బాగా వాడుకుంటున్నారు. వారి సంతోషం, బాధలు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూ ట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, టెలిగ్రామ్, షేర్ చాట్ వంటి సోషల్ మీడియా సాధనాలలో ఎక్కువ సమయం గడుపుతూ భౌతికంగా వ్యక్తుల మధ్య ఉండే సంభాషణలు, ప్రేమ, అనురాగాలు, ఆప్యాయతలకు, అనుబంధాలకి దూరమవుతున్నారు. సామాజిక మాధ్యమాలలో ఉండే స్నేహితులే వారికి నిజమైన స్నేహితులుగా భావిస్తున్నారు. తద్వారా భౌతికంగా విద్యార్థి దశలో, ఉద్యోగంలోనూ సామాజిక జీవనంలో కూడా స్నేహితులకు దూరమవుతున్నారు. సామాజిక మాధ్యమంలో పోస్టులు పెడుతూ వాటిలో వచ్చే లైకులు, కామెంట్లను చూసి సంబరపడిపోతున్నారు. అవి రాకపోతే బాధపడుతున్నారు. మానసికంగా కుంగిపోతున్నారు. ప్రత్యక్ష అనుభూతులకు దూరమవుతున్నారు.సోషల్ మీడియాలో పెట్టే పోస్టుల్లో నిజాలు గోరంతయితే దాన్ని కొండంతగా చూపించే పద్ధతికి అలవాటుపడుతున్నారు. ఊహా లోకంలో విహరిస్తున్నారు. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు సోషల్ మీడియాలో చూపెడుతున్నారు. ఇది వ్యక్తి సమగ్ర అభివృద్ధికి,వి కాసానికి గొడ్డలి పెట్టులాంటిది. స్టేట్ ఆఫ్ మొబైల్ -2023 ప్రకారం భారతీయులు ప్రతిరోజు సగటున ఐదు గంటల పాటు స్మార్ట్ ఫోన్లు ఉపయోగిస్తూ ఆన్‌లైన్‌లో గడుపుతున్నారు. అత్యధికంగా స్మార్ట్ ఫోన్లను ఉపయోగిస్తున్న వారిలో ప్రపంచంలోనే ఎనిమిదవ స్థానంలో భారతీయులు ఉన్నారు. విలువైన కాలాన్ని సోషల్ మీడియాలో వృథా చేస్తూ గడిపేస్తున్నారు. భారతీయ జనాభాలో యాక్టివ్ సోషల్ మీడియా ఉపయోగిస్తున్న ప్రజలు 33.4%. వీరు దాదాపుగా 2.6 గంటలు ప్రతీ రోజు సోషల్ మీడియాలో గడుతున్నారు. ఇది గమనించిన రాజకీయ పార్టీలు రాబోయే ఎన్నికల్లో సోషల్ మీడియా వేదిక ద్వారానే అత్యధిక ప్రచారం చేయనున్నాయి. గతంలో జరిగిన ఎన్నికల్లో రాజకీయ పార్టీలు సోషల్ మీడియానే అధికంగా వాడాయి. ఎన్నికల టైంలో ప్రజలు ఇంకా ఎక్కువ కాలం సోషల్ మీడియాలో గడిపే అవకాశం ఉంది. ప్రజల అవసరాలను గమనించిన సోషల్ మీడియా కంపెనీల యజమానులు వారి కాసుల పంట పండించుకుంటున్నారు. కోట్లకు పడగెత్తుతున్నారు. ప్రజలు ఎక్కువ సమయం సోషల్ మీడియాలో గడపడానికి ప్రత్యేకంగా యాప్లు రూపొందిస్తూ వారిని ఆకర్షిస్తున్నారు. దీనికి సైకాలజిస్టు, మార్కెటింగ్ మేనేజర్ల సలహా సూచనలు తీసుకుంటున్నారు. కార్పొరేట్ కంపెనీలు సోషల్ మీడియా యజమానులు వారి ఎజెండాలను ప్రజలపై తెలియకుండానే రుద్దుతున్నారు. తద్వారా ప్రజలు రాజకీయ పార్టీల ప్రచారాలను నమ్మి మోసపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అదే సమయంలో సోషల్ మీడియా దుర్వినియోగం ద్వారా మానవ సంబంధాలు పూర్తిగా దెబ్బ తింటున్నాయి. బాల్యంలోనే విద్యార్థులకు నైతిక విలువలు, మానవ సంబంధాలు, ప్రేమ, అనురాగం, ఆప్యాయతలు బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పైన, వీటిని విద్యా విధానంలో చేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. విద్యార్థులను, యువకులను ధనార్జక యంత్రాలుగా కాక మానవీయత కలిగిన వారుగా, మంచిపౌరులుగా రూపొందించాల్సిన బాధ్యత సమాజం పైన ఉంది. చిన్నతనం నుంచి విద్యార్థులు సామాజిక స్పృహను, ఎదుటి వారికి సహాయపడే గుణాన్ని అలవాటు చేస్తే వారు పెద్దయ్యాక సమాజ సేవకులుగా ఎదిగే అవకాశం ఉంటుంది. మానవ సంబంధాలు ఆర్థిక అవసర సంబంధాలుగా కాక ప్రేమ, అనురాగ ఆప్యాయత అనుబంధాలుగా మారే అవకాశం ఉంటుంది.

# బిజెపి నియంతృత్వ విధానాలు!


అందరి ఉమ్మడి కృషితో 17వ లోక్‌సభలో 97 శాతం పని జరిగిందని, ఇది స్వతహాగా సంతోషించదగ్గ విషయమని, ఏడు సెషన్లు 100% కంటే ఎక్కువ ఉత్పాదకతను కలిగి ఉన్నాయని, రాత్రంతా మేల్కొని కూర్చుని ప్రతి ఎంపి అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకునే ప్రయత్నం చేశారని అంటూ 17వ లోక్‌సభ చివరి సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ సంతోషం వ్యక్తం చేశారు. పరోక్షంగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ముందెన్నడూ లేని విధంగా ఫలదాయకంగా ఈ సమయంలో పార్లమెంట్ పని చేసిన్నట్లు ఘనతగా చాటుకున్నారు. అయితే, వాస్తవానికి పార్లమెంట్ పని తీరు నానాటికీ ప్రజాస్వామ్య సంప్రదాయాలకు తిలోదకాలిస్తూ, కేవలం మొక్కుబడిగా బిల్లుల ఆమోదం జరుపుకునేందుకు అన్నట్లుగా మారుతున్నాయి. ప్రభుత్వం తమకు వ్యతిరేకమైన స్వరాలు వినేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా విముఖంగా వ్యవహరిస్తున్నది. ఈ ఐదేళ్ల కాలంలో డిప్యూటీ స్పీకర్ నియామకం లేకుండానే సభా కార్యకలాపాలు జరపడం గమనిస్తే ప్రతిపక్షాల పట్ల ఏర్పరచుకున్న అసహనాన్ని వెల్లడి చేస్తుంది. 1969 నుండి డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్ష నేతకు ఇవ్వడం ఓ సంప్రదాయంగా కొనసాగుతూ వస్తున్నది. ఈ సంప్రదాయం పాటించడం ఇష్టం లేకనే స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారి ఆ పదవికి అసలు ఎన్నికనే జరపలేదు. లోక్‌సభ పని తీరుపై పౌర సమాజ బృందాలు విడుదల చేసిన 'ఛార్జ్ షీట్' ఈ సందర్భంగా విభ్రాంతి కలిగించే అంశాలను వెల్లడి చేసింది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యంగా, ప్రజాస్వామ్యానికి మాతృకగా చెప్పుకోవడమే గాని ఆచరణలో మన రాజకీయ పార్టీలు అత్యంత 'అప్రజాస్వామికం'గా మారుతున్నట్లు వెల్లడి అవుతుంది. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై చర్చకు ఆస్కారం లేకుండా చేస్తూ, వారి ఆందోళనల నేపథ్యంలో సభా కార్యక్రమాలు జరిపే ప్రయత్నమే చేయకుండా, చివరి రెండు రోజులు హడావుడిగా చర్చలు లేకుండా, ప్రతిపక్ష సభ్యులను సభ నుంచి బహిష్కరించి బిల్లులను ఆమోదింప చేసుకోవడం ఒక ఆనవాయితీగా మారింది. 97% పని జరిగిందని ప్రధాని ఏ విధంగా చెప్పారో గాని ఈ లోక్‌సభలో జరిగినన్ని తక్కువ సమావేశాలు ఇంతకు ముందెన్నడూ జరగలేదు. 17వ లోక్‌సభలో సుమారు 278 సెషన్స్ మాత్రమే జరిగాయి. వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలో 1999 నుండి 2004 వరకు 13వ లోక్‌సభలో జరిగిన 423 సిట్టింగ్‌లతో పోలిస్తే ఇది దాదాపు 34% తక్కువ. 2020లో, కరోనా మహమ్మారి కారణంగా అనేక ఇతర దేశాలు చట్టసభల ఆన్‌లైన్ సమావేశాలను నిర్వహించాయి. కానీ ఆ సమయంలో మన దేశంలో కేవలం 33 సమావేశాలు మాత్రమే జరిగాయి. దాదాపు ప్రతి సెషన్ సమయంలో కూడా ప్రభుత్వం తన స్వంత ఎజెండాను పూర్తి కాగానే గడువుకన్నా ముందుగానే వాయిదా వేస్తూ వచ్చింది. 2020 నుండి 2022 మధ్య ఆ విధంగా వరుసగా ఏడు సెషన్‌లు షెడ్యూల్ కంటే ముందే ముగిశాయి. 2023లో జరిగిన చివరికి ప్రత్యేక సెషన్‌తో పాటు శీతాకాల సమావేశాలు కూడా షెడ్యూల్ కంటే ముందే ముగిశాయి. షెడ్యూల్ కంటే ముందే సెషన్ ముగిసినప్పుడు, మిగిలిన రోజుల వ్యవధి కోసం అడిగే ప్రశ్నలన్నీ ముగిసిపోతాయి. ఇక ఆర్డినెన్స్‌ల జారీలో సహితం రికార్డు సృష్టించారు. యుపిఎ %××% ప్రభుత్వంలో 2004 -14 మధ్య 61 ఆర్డినెన్స్‌లు జారీ చేయగా, 2014 నుండి 2021 మధ్య 76 ఆర్డినెన్స్‌లు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు 17వ లోక్‌సభలో (డిసెంబర్ 21, 2023 నాటికి), లోక్‌సభలో 86 బిల్లులు, రాజ్యసభలో 103 బిల్లులను 2 గంటల కన్నా తక్కువ చర్చతో ఆమోదింపచేశారు. 2023 వర్షాకాల సమావేశంలో రాజ్యసభ ఫార్మసీ (సవరణ) బిల్లును కేవలం 3 నిమిషాల్లోనే ఆమోదించడంతో కొత్త రికార్డు సృష్టించబడింది. మరుసటి రోజు, లోక్‌సభ రెండు బిల్లులను సెంట్రల్ జిఎస్‌టి సవరణ, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి సవరణ బిల్లు 3 నిమిషాల్లో ఆమోదించింది! గత పార్లమెంట్ సెషన్‌లో ప్రభుత్వం ప్రతిపాదించిన ఎజెండాలో కేవలం మూడు బిల్లులు మాత్రమే ఉన్నాయి.అయితే ఎజెండాలో అసలు చేర్చని మరో 3 కొత్త బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2009- 2014 మధ్య అన్ని బిల్లులలో 71% స్టాండింగ్ కమిటీలకు పంపగా, 2019 నుండి 16% బిల్లులు మాత్రమే స్టాండింగ్ కమిటీలకు పంపారు. 2014 నుండి 2021 మధ్య పార్లమెంటులో ప్రవేశపెట్టిన 301 బిల్లులలో 24.5% బిల్లులు మాత్రమే సంప్రదింపుల కోసం సర్క్యులేట్ చేశారు. అయితే, ఈ 74 బిల్లులలో కనీసం 40 బిల్లులను సభా సంప్రదాయాల ప్రకారం అందుకు కనీసంగా 30 రోజుల వ్యవధి ఇవ్వలేదు. కీలకమైన మూడు క్రిమినల్ బిల్లులను అధ్యయనం చేసిన బిజెపి ఎంపి అధ్యక్షతన హెూం వ్యవహారాల కమిటీ ప్రజల నుండి అభిప్రాయాలను ఆహ్వానించలేదు. ఈ బిల్లుల తయారీ ప్రక్రియలో కమిటీ హడావిడిగా వ్యవహరించిన తీరు, ఎంపిక చేసిన వ్యక్తులను మాత్రమే కమిటీ ముందు అభిప్రాయలు చెప్పేందుకు ఆహ్వానించడం పట్ల పలువురు ప్రతిపక్ష ఎంపిలు అసమ్మతిని వ్యక్తం చేశారు. 2014 నుంచి కేవలం ఐదు బిల్లులు మాత్రమే ఉమ్మడి పార్లమెంటరీ కమిటీలకు వెళ్లాయి. 2016 నుండి 2023 మధ్య, సగటున, బడ్జెట్‌లో 79% చర్చ లేకుండానే ఆమోదించారు. ప్రతి మంత్రిత్వ శాఖ పద్దులను వివరంగా పరిశీలించడానికి స్టాండింగ్ కమిటీలనుఅవకాశం కల్పించేందుకు బడ్జెట్ సెషన్‌కు మధ్యలో విరామం ఇస్తారు. 2016లో 40 రోజులుగా ఉన్న విరామాన్ని 2021లో 20 రోజులకు తగ్గించారు. ఈ వ్యవహారాలను చూస్తుంటే చట్టాలపై, బడ్జెట్ పద్దులపై సమగ్రమైన చర్చల పట్ల ప్రభుత్వం ఏమాత్రం ఆసక్తి చూపలేదని, హడావుడిగా వాటి ఆమోదం పట్లనే శ్రద్ధ చూపిందని స్పష్టం అవుతుంది.అత్యాధునిక వసతులతో, ఛేదించే అవకాశం లేని భద్రతా ప్రమాణాలతో నిర్మించామని చెప్పుకున్న నూతన పార్లమెంట్ భవనం లో తొలి సమావేశంలోనే మొత్తం దేశం దిగ్భ్రాంతి చెందే విధంగా భద్రత ఉల్లంఘన బయటపడింది.

# 10న దేశవ్యాప్తంగా రైల్ రోకో.....



**న్యూఢిల్లీ :** తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా ఈ నెల 6న ఢిల్లీలో నిరసన ప్రదర్శనల్లో పాల్గొనాలని, 10న దేశవ్యాప్తంగా రైల్ రోకోలు చేపట్టాలని పిలుపునిచ్చాయి. ఈ మేరకు రైతు సంఘాల నేతలు సర్వన్ సింగ్ పంధేర్, జగ్జీత్ సింగ్ డాల్లేవాల్ ఇటీవల పోలీసుల కాల్పుల్లో మరణించిన యువ రైతు శుభకరన్ సింగ్ స్వగ్రామం బల్లోహెల్లా సంతాప సభ అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న నిరసన కేంద్రాల వద్ద రైతుల ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చేవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం శంభు, ఖానౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద జరుగుతున్న ఆందోళనకు పంజాబ్, హర్యానా రైతులు మద్దతు కొనసాగిస్తుండగా.. 6న ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులు, రైతు కూలీలు రాజధాని ఢిల్లీకి చేరుకుని నిరసనలో పాల్గొనాలని రైతు సంఘాలు నిర్ణయించాయని కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) నేత సర్వన్ సింగ్ పంధేర్ అన్నారు.

# పాక్ ప్రధానిగా షెహబాజ్....



ఇస్లామాబాద్: పాకిస్థాన్ ప్రధాన మంత్రిగా పీఎంఎల్-ఎన్ (పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్) నేత షెహబాజ్ షరీఫ్ ఎన్నికయ్యారు. ఆదివారం పార్లమెంటులో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారుల ఆందోళనల మధ్య జరిగిన ఓటింగ్‌లో ఆయన సునాయాసంగా విజయం సాధించారు. 336 మంది సభ్యులున్న జాతీయ అసెంబ్లీలో ఆయనకు 201 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థి అయిన పాకిస్థాన్ తెహ్రీక్ ఎ-ఇన్సాఫ్ (పీటీఐ) అభ్యర్థి ఒమర్ అయూబ్ ఖాన్ 92 ఓట్లు సాధించారు. మెజారిటీకి అవసరమైన వాటి కంటే షెహబాజ్‌కు 32 ఓట్లు అధికంగా వచ్చాయి. పీఎంఎల్-ఎన్‌కు పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) మద్దతిచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నిక అనంతరం 72ఏళ్ల షెహబాజ్‌ను దేశ 24వ ప్రధానిగా స్పీకర్ సర్దార్ అయాజ్ సాదిక్ ప్రకటించారు. సోమవారం అధ్యక్ష భవనంలో ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపడతారు. షెహబాజ్ ప్రధాని కావడం ఇది రెండోసారి. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఆగస్టు వరకు ఆయన ప్రధానిగా పని చేశారు. ప్రధాని ఎన్నిక సందర్భంగా సభలో గందరగోళం చెలరేగింది. ఇమ్రాన్ మద్దతుదారులు తమ నేతకు స్వేచ్ఛ కల్పించాలని డిమాండు చేస్తూ నినాదాలు చేశారు. ప్రతిగా నవాజ్ షరీఫ్‌కు మద్దతుగా అధికారపక్ష సభ్యులు నినదించారు. పీఎంఎల్-ఎన్ అధినేత, మాజీ ప్రధాని అయిన నవాజ్ షరీఫ్‌కు షెహబాజ్ వీర విధేయుడైన తమ్ముడు. గతంలో అనేకసార్లు సైన్యం నుంచి ప్రధాని పదవి ఆఫర్ వచ్చినా తిరస్కరించారు. గత ఏడాది అక్టోబరులో ప్రవాసం నుంచి తిరిగొచ్చిన నవాజ్ నాలుగోసారి ప్రధాని కావాలనుకుని ఎన్నికల బరిలో దిగారు. అయితే పార్టీకి అవసరమైన మద్దతు రాకపోవడంతో తన సోదరుడిని ప్రధానిని చేయాల్సి వచ్చింది. 1951లో పంజాబీ మాట్లాడే కశ్మీరీ కుటుంబంలో షెహబాజ్ జన్మించారు. లాహోర్‌లో చదువుకున్నారు. ఆయన కుటుంబం వ్యాపారం నిమిత్తం కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ నుంచి అమృత్‌సర్ జిల్లాలోని జాతీ ఉమ్రా గ్రామానికి వచ్చి స్థిరపడింది. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ ముఖ్యమంత్రిగా షెహబాజ్ పని చేశారు.

# పాక్‌లో మరో ఉగ్రవాది మిస్టరీ మరణం..!



పాక్‌కు చెందిన మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడైన షేక్ జమీల్ ఉర్ రహ్మాన్ ఖైబర్ ప్రావిన్స్‌లోని అబొటాబాద్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మరణించాడు. యునైటెడ్ జిహాద్ కౌన్సిల్‌కు అతడు స్వయం ప్రకటిత ప్రధాన కార్యదర్శి. పాక్‌లోని ఉగ్ర గ్రూప్‌లను ఇది సమన్వయం చేసుకొని కశ్మీర్‌లో దాడులు నిర్వహిస్తుంది. 1990ల్లో ప్రారంభించిన తెహ్రీక్ ఉల్ ముజాహిద్దీన్ అనే సంస్థకూ చీఫ్‌గా వ్యవహరిస్తున్నాడు. 2019లో దీనిపై కేంద్రం నిషేధం విధించింది. హిజ్బుల్, లష్కరే సంస్థలకు ఇది సహకరిస్తోందని ప్రభుత్వం తెలిపింది. 2022లో భారత హెూంశాఖ రహ్మాన్‌ను ఉగ్రవాదిగా ప్రకటించింది. ఇతడి స్వస్థలం కశ్మీర్‌లోని పుల్వామా. ఇక్కడ జరిగిన పలు దాడులకు ఇతడు ప్రధాన సూత్రధారి. కొన్నేళ్ల క్రితం సరిహద్దులు దాటి పాక్‌కు పారిపోయాడు. ఆ దేశ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఐఎస్ఐ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నాడు. తాజాగా ఇతడి మరణంతో కశ్మీర్‌లోని ఉగ్రకార్యకలాపాలు మందగిస్తాయని భద్రతా రంగ నిపుణులు అంచనావేస్తున్నారు. ముంబయి పేలుళ్ల సూత్రధారి, లష్కరే సీనియర్ కమాండర్ అజామ్ చీమా మృతి చెందిన విషయం తెలిసిందే. మల్కాన్‌వాలాలో అజామ్‌కు అంత్యక్రియలు నిర్వహించినట్లు నిఘా వర్గాలు తెలిపాయి. 26/11 పేలుళ్లతోపాటు.. 2006లో ముంబయి రైలు పేలుళ్ల వెనుకా అతని హస్తం ఉంది.

ఈ ఘటనలో 188 మంది ప్రాణాలు కోల్పోయారు. 800 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. 2008 ముంబయి తాజ్‌హెూటల్‌లో దాడులకు పాల్పడిన ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చాడనే కారణంగా అమెరికా అతడిని మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ జాబితాలో చేర్చింది.

# బిజెపికి బుద్ధి చెప్పాలి
## జన విశ్వాస్ సభలో నేతల పిలుపు....!



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పాలని ఇండియా ఫోరం నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం పాట్నాలో జరిగిన జనవిశ్వాస్ సభలో దేశవ్యాప్తంగా బిజెపి అనుసరిస్తున్న విభజన, మతతత్వ రాజకీయాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తొలుత బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మోడీ అసలు హిందువే కాదన్నారు. కొంత కాలం క్రితం తన తల్లి చనిపోయినప్పుడు మోడీ గుండు ఎందుకు గీసుకోలేదని అన్నారు.

తల్లి లేదా తండ్రి చనిపోయినప్పుడు గడ్డం తీసేసి, గుండు చేయించుకోవడం హిందువుల్లో ఒక ఆచారం అని, మోడీ ఆ పని ఎందుకు చేయలేదని లాలూ ప్రశ్నించారు. బీసీల అభ్యున్నతికి బీహార్‌లోనే కాదు, దేశవ్యాప్తంగా తాను కృషి చేస్తానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని మట్టికరిపిస్తామని ప్రతిన బూనారు. "ఈ గాంధీ మైదాన్‌లో దేశం నలుమూలల నుంచి వచ్చిన నేతల సమావేశాలు ఎన్నిసార్లు జరిగాయో తెలియదు. ఇక్కడి నుంచి దేశమంతటా సందేశం వెళ్లింది. బీహార్ గాలిలో చాలా బలం ఉంది. దేశ ప్రజలు దానిని అనుకరిస్తారు" అని అన్నారు. బీహార్ మాజీ డిప్యూటీ సిఎం తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ బిజెపి అబద్ధాల ఫ్యాక్టరీ అని, ఆర్‌జెడి హక్కులు, ఉద్యోగాలు, అభివృద్ధి కోసం పనిచేసే పార్టీ అని అన్నారు. 17 ఏళ్లలో నితీష్‌కుమార్, బిజెపి చేయలేనిది, తమ మద్దతుతో నడిచిన 17 నెలల్లో రాష్ట్రానికి చేయగలిగామని గుర్తు చేశారు.

తమ పార్టీ వెనుకబడిన, మైనారిటీ వర్గాల ప్రజల కోసమే పనిచేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ "పిఎం మోడీ 'మేరా గ్యారెంటీ' అని చెప్పారు, ఇకపై 'బిజెపి లేదా ప్రభుత్వ హామీ' అని చెప్పరు. ఇప్పుడు నేను మీకు ప్రధాని మోడీ హామీలను చెబుతాను. 2014లో ఈ దేశ యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, అలా చేశారా? అందరికీ 'పక్కా' ఇల్లు కట్టిస్తానని కూడా చెప్పాడు, అలా చేశాడా? ఆయన, ఆయన పార్టీ హామీ ఈ దేశ ప్రజలకు ద్రోహం చేయడమేనని, అవాస్తవాలతో తారుమారు చేయడమేనని చెప్పారు.

# పరిచయం లేని మహిళను అలా పిలిస్తే లైంగికంగా వేధించినట్లే



**కోల్‌కతా :** మహిళలను నోటికొచ్చినట్టు పిలిస్తే జైల్లో ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుందని కలకత్తా హైకోర్టు హెచ్చరించింది. మహిళలతో మాట్లాడేటప్పుడు నోరు దగ్గర పెట్టుకోవాల్సిన అవసరం చాలా ఉందని న్యాయస్థానం గుర్తుచేసింది. ముఖ్యంగా పరిచయం లేని మహిళలను 'డార్లింగ్' అని పిలవడం లైంగికంగా వేధించడమే అవుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. అలా పిలిస్తే ఐపిసి 354 ఎ, 509 సెక్షన్ల కింద నేరస్థులుగా పరిగణించవచ్చని పేర్కొంది. ఈ మేరకు పోర్టు బ్లెయిర్‌లోని హైకోర్టు బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ జై సేన్‌గుప్తా తీర్పు వెలువరించారు. గతేడాది అండమాన్ నికోబార్‌లోని మాయాబందర్ ప్రాంతంలో దుర్గా పూజ సందర్భంగా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. విధుల్లో ఉన్న ఒక మహిళా కానిస్టేబుల్‌తో జనక్ రామ్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. మద్యం మత్తులో ఉన్న అతను ఆమెను డార్లింగ్ అని సంబోధించాడు. అంతేగాక 'చలాన్ ఇవ్వడానికి వచ్చావా..?' అంటూ దురుసుగా మాట్లాడాడు. మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీనిపై విచారణ చేపట్టిన నార్త్-మిడిల్ అండమాన్ ఫస్ట్ క్లాస్ కోర్టు జనక్ రామ్‌ను దోషిగా తేల్చింది. మూడు నెలల జైలు శిక్షతోపాటు రూ.500 జరిమానా విధించింది. ఈ తీర్పును అడిషనల్ సెషన్స్ కోర్టులో జనక్‌రామ్ సవాల్ చేయగా ఆ కోర్టు కూడా తీర్పును సమర్థించింది. దాంతో కలకత్తా హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు సైతం ఫస్ట్‌క్లాస్ కోర్టు తీర్పును సమర్థించింది. డార్లింగ్ అని పిలవడం లైంగిక వేధింపేనని తేల్చి చెప్పింది.

# ఈ విజయం గాజాదే ! లేబర్ పార్టీకి ఎదురు దెబ్బ




**లండన్ :** గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహెూమాన్ని గుడ్డిగా సమర్థిస్తూ వచ్చిన బ్రిటన్ లేబర్ పార్టీకి పార్లమెంటు ఉప ఎన్నికల్లో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. లేబర్ పార్టీ ఎంపీ సరల్ టోనీ లాయిడ్ మరణంతో ఖాళీ అయిన రొచ్డాలె నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో వర్కర్స్ పార్టీ అభ్యర్థి జార్జి గాలొవే సంచలనాత్మక విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచిన బడా వ్యాపారవేత్త డేవిడ్ తులీపై దాదాపు 6వేల ఓట్ల తేడాతో అవలీలగా గెలుపొందారు. మొత్తం పోలైన ఓట్లలో గలోవెకు 40 శాతం ఓట్లు లభించాయి. ఈ ఏడాదిలో బ్రిటన్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ఎన్నిక ఫలితం లేబర్ పార్టీకి ఒక గట్టి హెచ్చరికగా పరిశీలకులు బావిస్తున్నారు శనివారం తెల్లవారు జామున ఎన్నికల ఫలితాలు ప్రకటించిన వెంటనే గాలొవె తన పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద గుమికూడిన మద్దతుదారులనుద్దేశించి మాట్లాడుతూ, "గాజాలో ఇజ్రాయిల్ సాగించే మారణకాండను ప్రోత్సహిస్తూ మీరు పోషించిన పాత్రకు తగిన మూల్యం చెల్లించారు." అని లేబర్ నేత సర్ కెయిర్ స్టార్మర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. "తరతరాలుగా లక్షలాదిమంది ప్రజల విశ్వాసాన్ని, ఆదరాభిమానాలను చూరగొన్న లేబర్ పార్టీ మీరు తీసుకున్న వైఖరి వల్ల ఈనాడు మొత్తంగా ఆ నమ్మకాన్ని కోల్పోతోంది.." అని అన్నారు. పార్లమెంటరీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన రెండూ పత్తా లేకుండా పోయాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత లేబర్ పార్టీకి ఇది అతి పెద్ద క్షీణత అని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా లేబర్ పార్టీకి మరింత నష్టం కలగకుండా ఉండాలంటే గాజాలో తక్షణమే, శాశ్వత కాల్పుల విరమణ అవసరాన్ని బలంగా నొక్కి చెప్పాల్సిన అవసరముందని ఆ పార్టీలో ఒక సెక్షన్ బలంగా వాదిస్తోంది.

# స్ట్రాబెర్రీ చేసే మేలు తెలిస్తే తినకుండా ఉండలేరు...?




ఎంతో రుచికరమైన స్ట్రాబెర్రీ పండ్లు ఆరోగ్యానికి చాలా విధాలుగా మేలు చేస్తాయి. ఇవి మధుమేహాన్ని చాలా ఈజీగా నియంత్రిస్తాయి.ప్రతి రోజూ స్ట్రాబెర్రీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది.ఇందులో ఉండే విటమిన్ సి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. స్ట్రాబెర్రీ ఎముకలను కూడా బలంగా ఉంచుతుంది. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, స్ట్రాబెర్రీ చర్మ సమస్యలను దూరం చేసి, లైంగిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.స్ట్రాబెర్రీ ఫైబర్ మంచి మూలం. దీని వినియోగం జీర్ణక్రియకు దివ్యౌషధంగా పరిగణించబడుతుంది. మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో స్ట్రాబెర్రీ సహాయపడుతుంది. రోజువారీ వినియోగం కడుపుకు ప్రయోజనకరంగా ఉంటుంది. స్ట్రాబెర్రీ జ్యూస్ తాగడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడు కణాలకు ఎలాంటి హాని జరగకుండా చూస్తాయి. స్ట్రాబెర్రీ జ్యూస్ తాగడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.స్ట్రాబెర్రీస్ గుండెకు రక్త సరఫరా కూడా సాఫీగా జరుగుతుంది. స్ట్రాబెర్రీ జ్యూస్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా స్ట్రాబెర్రీలు అలర్జీల సమస్యను తగ్గిస్తాయి.స్ట్రాబెర్రీలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల వీటిని తింటే ఎక్కువసేపు ఆకలి వేయదు. దీంతో బరువు సులభంగా తగ్గుతారు. స్ట్రాబెర్రీలో కేలరీలు తక్కువగా ఉంటాయి. స్ట్రాబెర్రీలో ఫ్లేవనాయిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి అలర్జీలను నివారిస్తాయి. ఇది రక్త సరఫరాను మెరుగుపరుస్తుంది. ఇవి ఇన్సులిన్ లెవల్స్ పెరగకుండా షుగర్ లెవెల్స్ ని కంట్రోల్ లో ఉంచుతాయి.స్ట్రాబెర్రీ పండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తంలో ఆక్సిజన్ స్థాయిని మెరుగుపరుస్తుంది. స్ట్రాబెర్రీలో అనేక విటమిన్లు, ఖనిజాలు కూడా పుష్కలంగా ఉన్నాయి.

## ఉలవలు చేసే మేలు......!



ఉలవలు గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇవి ఆరోగ్యానికి చాలా విధాలుగా మేలు చేస్తాయి. ఇవి రక్తనాళాల్లో పేరుకుపోయిన చెడు కొవ్వులను కరిగించడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి.అందువల్ల గుండెకు రక్తసరఫరా మెరుగుపర్చి గుండె సంబంధ సమస్యలు రాకుండా కాపాడతాయి.జ్వరంతో పాటు ఆయాసం, దగ్గు వంటి సమస్యలు ఉన్నవారు ఉలవల కషాయం తాగడం మంచిది. ఈ కషాయం జ్వరం, దగ్గు వంటి సమస్యలను తగ్గిస్తుంది. తక్కువ స్పెర్మ్ కౌంట్ కారణంగా సంతానోత్పత్తి సమస్యలను ఎదుర్కొంటున్న పురుషులకు కూడా ఉలవలు తింటే చాలా రకాలుగా మేలు కలుగుతుంది. అలాంటి వారు నిపుణుల సలహా తీసుకున్న తర్వాత వీటిని తమ ఆహారంలో చేర్చుకోవచ్చు.మనలో చాలా మంది కూడా తరచూ ఎక్కిళ్లు సమస్యతో బాధపడుతుంటారు. అలాంటి వారు ఉలవలు తీసుకోవడం చాలా మంచిది. ఉలవలు తినడం ద్వారా ఎక్కిళ్లు రాకుండా ఉంటాయి. బరువు ఎక్కువగా ఉన్నవారు ఉలవలు తింటే చాలా మంచిది. వీటిలోని ఫైబర్ శరీరంలో చెడు కొలెస్ట్రాల్ కరిగించడంలో సహాయపడుతుంది. తద్వారా బరువు నియంత్రణలో ఉంచుతుంది. ఓ కప్పు ఉలవ చారుకు సమానంగా కొబ్బరి నీళ్లు తీసుకుంటే మూత్రంలో మంట నుంచి ఉపశమనం పొందవచ్చు. తరచూ మూత్రంలో మంటతో బాధపడేవారు ఈ టిప్ ఖచ్చితంగా ట్రై చేయండి. ముఖ్యంగా పెరిగే పిల్లలకు ఈ ఉలవలు తినిపిస్తే చాలా రకాలుగా మంచిది.ఎందుకంటే ఇవి మన పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలలో సహాయపడతాయి.


## ఊబకాయం ప్రాణాంతకమా..?



ఊబకాయం ఉంటే ప్రాణాల మీద ఆశలు వదలాల్సిందే? ఊబకాయం సమస్య ప్రస్తుత రోజుల్లో యువతకు శాపంలాగా మారింది. కొంతమందికి అయితే ఈ సమస్య కారణంగా పెళ్లి కూడా అవ్వట్లేదు. చాలా మంది ఈ సమస్య వల్ల అనేక రోగాలతో చనిపోతున్నారు. ఎంత డబ్బున్నా కానీ ఈ సమస్యకు చికిత్స అందించలేము. ఒకవేళ చికిత్స తీసుకున్నా బ్రతుకుతామన్నా గ్యారెంటీ కూడా లేదు.అపర కుబేరుడు ముఖేష్ అంబాని కొడుకు అనంత్ అంబాని ఈ సమస్య బారిన పడి అల్లాడి పోతున్నాడంటే ఈ సమస్య ఎంత ప్రమాదమో అర్ధం చేసుకోవచ్చు. ప్రస్తుతం మనలో చాలా మంది కూడా ఊబకాయం సమస్యతో ఎంతగానో బాధపడుతున్నారు. పిల్లల నుంచి పెద్దల దాకా ఈ సమస్య వల్ల అనేక అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఊబకాయం కారణంగా నిరాశ, ఆందోళన లాంటి లక్షణాలు ప్రభావం చూపి రోగాల బారిన పడేలా చేస్తాయి.ఊబకాయం ఊపిరితిత్తుల పనితీరును పరిమితం చేసి పరిస్థితులకు దారితీస్తుంది. అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా, తగినంత శ్వాస లేకపోవడం వల్ల రక్తంలో తక్కువ ఆక్సిజన్ స్థాయిలు, అధిక కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు ఏర్పడతాయి.రొమ్ము, పెద్దప్రేగు, ఎండోమెట్రియల్, మూత్రపిండాల క్యాన్సర్తో సహా కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదంతో ఊబకాయం ముడిపడి ఉంది. స్లీప్ అప్నియాకు ఊబకాయం ఒక ప్రధాన కారణం. ఇది నిద్రలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందికరంగా ఉంటుంది.

## అధిక దాహం వేస్తుందా........?

ప్రతి రోజు శరీరానికి సరిపడా నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిదే.ముఖ్యంగా జీర్ణక్రియ సంబంధిత సమస్యల నుంచి మరెన్నో సమస్యలకు మంచి నీరు పరిష్కారం అని తెలిసిందే.కానీ కొంతమందికి మాత్రం ఎప్పుడూ కూడా అధిక దాహం వేస్తుంది. అధిక దాహం వేస్తే ఖచ్చితంగా మీ ఆరోగ్యం చిక్కుల్లో పడ్డట్లే.శరీరం బలహీనంగా మారినా, శరీరానికి కావాల్సిన ప్రోటీన్లు లభించకపోయినా తరచూ దాహం వేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పదే పదే దాహం వేస్తుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.రక్త హీనత సమస్యతో ఇబ్బంది పడే వారిలోనూ దాహం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో ఆర్బీసీ తక్కువగా ఉన్నప్పుడు కూడా మళ్లీ మళ్లీ దాహం వేస్తుంది.ఇక కొన్ని అనారోగ్య సమస్యల కోసం ఉపయోగించే మందులను ఉపయోగించినా కూడా తరచూ దాహం వేస్తుంది. దీనికి కారణం కొన్ని మందులు మూత్ర విసర్జన లక్షణాన్ని కలిగిస్తాయి. ఇది అధిక దాహానికి కారణమవుతుంది.శరీరంలో కావాల్సినంత నీరు లేని సమయంలో కూడా పదే పదే దాహం వేస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీనినే డీహైడ్రేషన్ సమస్యగా పిలుస్తుంటారు. ఎక్కువగా చమటలు పట్టడం నిత్యం జ్వరం రావడం దీనికి లక్షణాలుగా చెప్పొచ్చు.మీకు అదే పనిగా పదే పదే అధిక దాహం కనుక వేస్తూంటే అది మధుమేహం లక్షణంగా భావించాలని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యను వైద్య పరిభాషలో పాలీడీప్సియాగా పిలుస్తారు. దీనికి కారణం.. డయాబెటిస్ కారణంగా ఇన్సులిన్ పనిచేయదు. దీంతో మూత్రం నుంచి గ్లూకోజ్ రావడం ప్రారంభమవుతుంది. మూత్రంలో గ్లూకోజ్ వెళ్లడం వల్ల శరీరానికి ఎక్కువ నీరు అవసరపడుతుంది. పదేపదే దాహం వేయడానికి ఇదే కారణమని చెబుతున్నారు.వేసవి కాలంలో దాహం వేయడం అనేది చాలా సర్వసాధారణమైన



విషయం. అయితే వాతావరణం చల్లగా ఉన్నా పదే పదే దాహం వేస్తుంటే మాత్రం ఖచ్చితంగా అలర్ట్ అవ్వాల్సిందేనని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.కాబట్టి మీకు పదే పదే అధిక దాహం వేస్తే ఖచ్చితంగా డాక్టర్ ని సంప్రదించండి. పలు జాగ్రత్తలు తీసుకోండి. ఎల్లప్పుడూ కూడా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండండి.


## ఆరోగ్యానికి మామిడి పువ్వు....!

వేసవి కాలం వచ్చేసింది. మామిడి పండ్లని తెచ్చిపెట్టింది. పండ్లలో రారాజైన మామిడి పండు ఇష్టపడని వారంటూ ఎవరూ ఉండరు.. అయితే, మామిడి పండ్లను తింటే గడ్డలు వస్తాయని, వేడి చేస్తాయని చాలామంది భయపడతారు.కానీ మామిడి పండ్లు చేసే మేలు అంతా ఇంత కాదు. కేవలం మామిడి పండ్లు మాత్రమే కాదు. మామిడి పువ్వు కూడా చాలా మేలు చేస్తుంది.వేసవి కాలంలో చాలా మంది కూడా వేడి వల్ల ముక్కుదిబ్బడ సమస్యతో బాధపడుతుంటారు. వేడి వల్ల ఈ సమస్య వస్తే, మామిడి పువ్వు వాసన ఈ సమస్యను తగ్గించగలదు.మామిడి పువ్వు మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడే అనేక లక్షణాలను కలిగి ఉంది. మీరు మామిడి పువ్వుల పొడిని తయారు చేసి, ప్రతిరోజూ ఉదయం ఒక చెంచా నీటిలో త్రాగవచ్చు. లేదా మామిడి పువ్వు రసం తీసి ఉదయాన్నే సేవించాలి. ఇది మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది.ఈ రోజుల్లో ఎసిడిటీ సమస్య సర్వసాధారణం అయిపోయింది. ఈ సమస్యను దూరం చేయడంలో మామిడి పువ్వు రసం చాలా ఎఫెక్టివ్ గా పనిచేస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.ఈమధ్య కాలంలో తప్పుడు ఆహారం కొలెస్ట్రాల్ సమస్యకు దారి తీస్తోంది. కొలెస్ట్రాల్కు అతి పెద్ద కారణం ఫాస్ట్ ఫుడ్, క్రమరహిత జీవనశైలి. దీని వల్ల చాలా మందికి బరువు పెరిగే సమస్య ఉంటుంది. బరువు తగ్గాలంటే మామిడి పువ్వు రసం తాగండి. దీని రసాన్ని




క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కొవ్వు తగ్గుతుంది. కొలెస్ట్రాల్ కూడా అదుపులోకి వస్తుంది.వేసవిలో చాలా మందికి కూడా కడుపునొప్పి అనేది సాధారణ సమస్యగా మారిపోయింది. విరేచనాలు, అసిడిటీ, డీహైడ్రేషన్, అనేక ఇతర జీర్ణ సమస్యలు వస్తాయి. అటువంటి పరిస్థితుల్లో మామిడి పువ్వును తినడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరచడానికి మామిడి పువ్వులను తినండి. దీని కోసం మామిడి పువ్వులను రాత్రంతా నీటిలో నానబెట్టండి. తర్వాత దీన్ని వడగట్టి ఉదయాన్నే తాగాలి. మామిడి పువ్వులు ప్రకృతిలో చల్లదనాన్ని కలిగి ఉంటాయి. కడుపులో వేడిని శాంతపరుస్తాయి.

## ఈ లక్షణాలుంటే లివర్ వ్యాధి ఖాయం?



ప్రస్తుతం చాలా మంది కూడా ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నారు. ఒకప్పుడు కేవలం ఆల్కహాల్ తాగే వారికే ఈ ఫ్యాటీ లివర్ సమస్య ఎక్కువగా వచ్చేది. కానీ ప్రస్తుతం ఆల్కహాల్ అలవాటు లేని వారిలో కూడా ఈ సమస్య చాలా ఎక్కువగా వస్తుంది.మితిమీరిన మాంసం తినడం, అనారోగ్యకరమైన జీవన విధానం, తీసుకునే ఆహారం నాణ్యతలేని కారణంగా ఫ్యాటీ లివర్ సమస్య బారినపడుతోన్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది. అయితే ఫ్యాటీ లివర్ సమస్యను ముందుగానే గుర్తిస్తే ఖచ్చితంగా దానికి తగిన చికిత్స తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.ఆల్కహాల్ అధికంగా తాగడం వల్ల కాలేయం ఆల్కహాల్ని విచ్ఛిన్నం చేస్తుంది. ఇది శరీరం నుంచి దాన్ని తొలగించలేదు. దాన్ని విచ్ఛిన్నం చేసే ప్రక్రియ హానికరమైన పదార్థాలను కూడా ఉత్పత్తి చేస్తుంది. ఇది కాలేయ కణాలను దెబ్బతీస్తుంది. దీంతో కాలేయ వాపు సంభవిస్తుంది.ఇక ఫ్యాటీ లివర్ వచ్చే వారిలో అతిసారం సమస్య వేధిస్తుంటుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ వ్యాధి పేగు కదలికలను పాడు చేస్తుంది. సిర్రోసిస్లో చిన్న పేగు పనితీరు ఆటంకం ఏర్పడటం వల్ల బ్యాక్టీరియా అభివృద్ధి చెందుతుంది. ఇది అతిసారం సమస్యకు దారి తీస్తుంది.మిమ్మల్ని నిత్యం అలసట, నీరసం వేధిస్తుంటే ఫ్యాటీ లివర్ సమస్య కారణం కావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్య దీర్ఘకాలంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి.ఫ్యాటీ లివర్ సమస్యలో ఉన్న వారు ఆకలి కోల్పోతారు. కాలేయ వ్యాధిలో గ్రెలిన్ స్థాయిలు భోజనం చేసే ముందు పెరగడంలో విఫలమవుతాయి. దాని వల్ల ఆకలిగా అనిపించదు.ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారిలో పొత్తి కడుపు నొప్పి ఉంటుంది. దీర్ఘకాలంగా ఈ సమస్యతో బాధపడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు. కడుపునొప్పితో పాటు వికారం కూడా ఉంటే ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నట్లేనని గుర్తించాలి. కాబట్టి ఈ లక్షణాలు తెలుసుకొని వెంటనే డాక్టర్ ని సంప్రదించండి. మితిమీరిన మాంసం తినడం, అనారోగ్యకరమైన జీవన విధానం, తీసుకునే ఆహారం నాణ్యతలేని కారణంగా ఫ్యాటీ లివర్ సమస్య బారినపడుతోన్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది. అయితే ఫ్యాటీ లివర్ సమస్యను ముందుగానే గుర్తిస్తే ఖచ్చితంగా దానికి తగిన చికిత్స తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.ఆల్కహాల్ అధికంగా తాగడం వల్ల కాలేయం ఆల్కహాల్ని విచ్ఛిన్నం చేస్తుంది. ఇది శరీరం నుంచి దాన్ని తొలగించలేదు. దాన్ని విచ్ఛిన్నం చేసే ప్రక్రియ హానికరమైన పదార్థాలను కూడా ఉత్పత్తి చేస్తుంది.

## విటమిన్ ఈ కి పుట్టినిల్లు గుమ్మడి...!



సాధారణంగా గుమ్మడికాయను పండగలప్పుడు మరియు ఫంక్షన్ ఉన్నప్పుడు మాత్రవే వినియెగిసన్తా ఉంటారు.గుమ్మడికాయను ఒకవేళ తినాల్సి వస్తే గుమ్మడికాయని తిని విత్తనాలు పడేస్తూ ఉంటారు. కానీ గుమ్మడికాయలలో ఉన్న లాభాల గురించి తెలిస్తే,ఈసారి అసలు అలా చేయలేరని చెబుతున్నారు ఆహార నిపుణులు.ఎందుకంటే గుమ్మడి విత్తనాలను తరచూ తీసుకోవడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలను దరిచేరకుండా,మనం మన ఆరోగ్యాన్ని మన చేతుల్లో ఉంచుకోవచ్చు అని కూడా సూచిస్తూ ఉన్నారు.అసలు గుమ్మడి విత్తనాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో మనము తెలుసుకుందాం పదండి..గుమ్మడి విత్తనాలలో అధికంగా జింక్ మరియు మెగ్నీషియం,ఒమేగా 3 ఫ్యాటి యాసిడ్స్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పుష్కలంగా లభిస్తాయి.గుమ్మడి విత్తనాలను డైరెక్ట్ గా తీసుకోవడం కన్నా,రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను పొందవచ్చు. ఇలా రాత్రంతా నానబెట్టిన గుమ్మడి విత్తనాలను గర్భిణీ స్త్రీలు తినడంతో వారి ఆరోగ్యానికి మేలు చేకూరడమే కాక,వారి బిడ్డ ఎదుగుదలకు మరియు ముఖ్యంగా పిల్లల మెదడు పెరుగుదలకు ఇందులో ఉన్న జింక్ చాలా బాగా దోహదపడుతుంది. ఈ మధ్యకాలంలో చాలామంది హార్ట్ సమస్యలతో బాధపడుతున్నారు.ముఖ్యంగా మగవారు గుమ్మడి విత్తనాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల వారికి నడివయసులో వచ్చే హార్ట్ ఎటాక్స్ సమస్యలకు దూరంగా ఉండవచ్చు.మరియు పురుషులలో అధికంగా చూసే స్పెర్మ్ సమస్యలు కూడా తొలగిపోతాయి.అంతే కాక రక్తంలో గ్లూకోజ్ లెవెల్స్ క్రమబద్ధీకరించడానికి కూడా చాలా బాగా ఉపయోగపడి,మధుమేహం కంట్రోల్ లో ఉంటుంది. గుమ్మడి విత్తనాలు విటమిన్ ఈ కి పుట్టినిల్లు అని చెప్పవచ్చు. అందువలన గుమ్మడి విత్తనాలను వారి రోజువారి డైట్ లో వారి చర్మ సమస్యలు తొలగడమే కాకుండా రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. గుమ్మడి విత్తనాలను పెద్దవి చిన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరు తీసుకోవచ్చు ఒకవేళ చిన్నపిల్లలు తినడానికి అంత ఇష్టం చూపకపోతే వారికి డ్రై ఫ్రూట్స్ లడ్డూలు లాగా తయారు చేసి ఇవ్వడం చాలా ఉత్తమం. ఇలా రాత్రంతా నానబెట్టిన గుమ్మడి విత్తనాలను గర్భిణీ స్త్రీలు తినడంతో వారి ఆరోగ్యానికి మేలు చేకూరడమే కాక,వారి బిడ్డ ఎదుగుదలకు మరియు ముఖ్యంగా పిల్లల మెదడు పెరుగుదలకు ఇందులో ఉన్న జింక్ చాలా బాగా దోహదపడుతుంది.



తన నటనతో ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకున్నారు నటి తమన్నా. ఆమె సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 19 ఏళ్లు పూర్తయింది. దీంతో సినీ ప్రముఖులు, అభిమానులు అభినందనలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా నటి కాజల్ అగర్వాల్ శుభాకాంక్షలు చెబుతూ అభిమానులు ఎడిట్ చేసిన తమన్నా పోస్టర్లను షేర్ చేశారు. దీనికి తమన్నా రిప్లై ఇచ్చారు. 'థాంక్యూ కాజు. ఇన్ని సంవత్సరాల నుంచి నాకెంతో మద్దతుగా నిలిచావు. హద్దులు లేనిప్రేమను పంచావు. నీ లాంటి స్నేహితురాలు ఉండడం వల్లే నా కెరీర్ హాయిగా కొనసాగుతోంది. అభిమానుల అద్భుతమైన అంకితభావం, వాళ్ల ఉత్సాహం నాకు రెట్టింపు శక్తినిస్తాయి. మీ అందరికీ నచ్చే చిత్రాలను అందిస్తానని హామీ ఇస్తున్నా. రానున్న సంవత్సరాలు ప్రేమతో నిండిన లెక్కలేనన్ని జ్ఞాపకాలను అందిస్తాయని ఆశిస్తున్నా' అని రిప్లై ఇచ్చారు. తమన్నా 2005లో హిందీ సినిమా 'చాంద్ సా రోషన్ చెహ్రా'తో తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. అదే ఏడాది 'శ్రీ' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత తెలుగు, తమిళ, హిందీ భాషల్లో అగ్ర హీరోల సరసన నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ఒకవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు వెబ్ సిరీస్‌లలో నటిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. తెలుగులో 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'ఓదెల 2'లో తమన్నా ప్రధాన పాత్రధారిగా నటిస్తున్నారు. అశోక్‌తేజ దర్శకుడు. సంపత్ నంది టీమ్ వర్క్స్‌తో కలిసి మధు క్రియేషన్స్ పతాకంపై డి.మధు నిర్మిస్తున్నారు. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్.సింహా కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## అభిమానులతో సెల్ఫీలు దిగి, సందడి చేసి!

నటి సమంత రూత్ ప్రభు సోమవారం ఉదయం తిరుచానూరులో కనిపించారు. పద్మావతి అమ్మవారి ఆలయాన్ని సందర్శించేందుకు ఆమె వచ్చారు. ఆలయ సందర్శనకు సంబంధించిన వీడియోను ఆమె బృందం ఎక్స్ లో షేర్ చేసింది.

ఈ ఉదయం తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు' అని ఆమె పిఆర్ ఎక్స్ లో ఒక వీడియోను పంచుకున్నారు. ఈ వీడియోలో సమంత షేడ్ కుర్తా-పైజామా సెట్ ధరించి చిరునవ్వులు చిందిస్తోంది. సింపుల్ గోల్డ్ చెవిపోగులు, నుదుటిపై బొట్టు పెట్టుకుని ఫిదా చేసింది. ఆలయంలో ఆమెను చూసిన అభిమానులు సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. సమంత కూడా అడిగిన వెంటనే ఫొటోలకు ఫోజులిచ్చారు.

## నాన్న ముందే లైంగిక వేధింపులు ఎదుర్కొన్నాను: హీరోయిన్

సంచలన నటీమణుల్లో ఆండ్రియా ఒకరని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. రీసెంట్‌గా సైంధవ్ చిత్రంలో కనిపించిన ఈ బ్యూటీ తన నటనతో మెప్పించింది. ఆమె జీవితంలో రాసలీలలు, ప్రేమలో పడడం, మోసపోవడం వంటి సంఘటనలు మీడియాలో కథలు కథలుగా వెలువడిన విషయం తెలిసిందే.తన గ్లామరస్ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేస్తూ ఎప్పుడూ అభిమానులకు టచ్‌లో ఉంటుంది. ఆమె నటి మాత్రమే కాదు మంచి గాయని కూడా..సింగర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన ఈ బ్యూటీ.. 2005లో తమిళ సినిమాతో ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. . నటిగానే కాకుండా గాయనిగా కూడా మెరిసిన ఆండ్రియా... వివాదాలకు కొదవలేదు. ఆమె అనిరుధ్‌తో ప్రేమ వ్యవహారం, సీనియర్ నటుడితో సన్నిహిత సంబంధం వంటి అనేక వివాదాల్లో చిక్కుకుంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో చిన్న వయసులోనే లైంగిక వేధింపులకు గురైనట్లు ఆమె చెప్పుకొచ్చింది.






## భీమా విజయం సాధిస్తుంది: గోపీచంద్

ఇప్పుడు మంచి విజయం కోసం ఎదురు చూస్తున్న నటుల్లో గోపీచంద్ ఒకరు. అతనిప్పుడు ఒక యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఎ హర్ష దర్శకత్వం వహిస్తున్నారు, కె కె రాధామోహన్ నిర్మాత. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలుగా నటించారు. మార్చి 8న మహా శివరాత్రి సందర్భంగా ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ విడుదల వేడుక హన్మకొండ వరంగల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా కథానాయకుడు గోపీచంద్ మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత మీ అందరినీ చూడటం చాలా ఆనందంగా వుంది. ఇన్నేళ్ళ నుంచి నన్ను మీ గుండెల్లో పెట్టి చూసుకుంటున్న మీ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అని చెప్పారు. 'భీమా' సినిమా గురించి చెపుతూ, ఈ సినిమా మొదలుపెట్టడానికి మా కో ప్రొడ్యూసర్ శ్రీధర్ గారు కారణం. ఆయనే దర్శకుడు హర్షని నాకు పరిచయం చేశారు. 'భీమా' అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది, ప్రతి సన్నివేశం చాలా బావుటుంది అని చెప్పారు గోపీచంద్. 'నేను సాధారణంగా ఇలా చెప్పాను... కానీ ఈ సినిమా కేక పుట్టిస్తుంది. అందులో సందేహం లేదు. ఇంత బాగా సపోర్ట్ చేసిన నిర్మాత రాధమోహన్ గారికి ధన్యవాదాలు,' అని చెప్పారు గోపీచంద్. ఈ సినిమాకి సంగీత దర్శకుడు రవి బస్రూర్ అద్భుతమైన సంగీతం ఇచ్చారని అతన్ని కొనియాడారు గోపీచంద్. ఈ 'భీమా' సినిమాకి వేరే లెవల్ లో సంగీతం కొట్టాడు. అలాగే యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్ లక్ష్మణ్, వెంకట్, రవి వర్మ చాలా ఎక్స్ ట్రార్డినరీ ౹÷ట్ సీక్వెన్స్ ఇచ్చారని చెప్పారు. ఇంటర్వెల్, క్లైమాక్స్ ఫైట్స్ గొప్పగా అలరిస్తాయి. అజ్జు చాలా పవర్ ఫుల్ డైలాగ్స్ రాశాడు. తను చాలా మంచి రైటర్ అవుతాడు అని తన సినిమా ఈసారి విజయం సాధిస్తుందని చాలా నమ్మకంగా చెప్పారు



## అంబానీ ఇంట పెళ్లి వేడుకల్లో బిగ్ బి

అంబానీ ఇంట జరుగుతున్న పెళ్లి వేడుకలు అద్భుతంగా ఉన్నాయని బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అమితాబ్ బచ్చన్ ప్రశంసించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చెంట్ ప్రీవెడ్డింగ్ వేడుకలు ఘనంగా జరిగాయి. గుజరాత్ జామ్‌నగర్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో అనేకమంది సినీ తారలు పాల్గొన్నారు. అమితాబ్ బచ్చన్ కుటుంబసమేతంగా ఈ వేడుకలకు హాజరయ్యారు. తిరిగి ముంబయి వెళ్తూ తన బ్లాగ్‌లో నోట్ రాశారు. 'అట్టహాసంగా నిర్వహించిన వేడుకలతో పాటు, వంతారా ఏర్పాటు చేయాలన్న ఆలోచన ప్రశంసనీయం. ఈ వేడుకలో భాగం అయినందుకు సంతోషంగా ఉంది. వంతారా సమగ్ర జంతు సంరక్షణ, పునరావాస కేంద్రం. గాయపడిన జంతువుల్ని కాపాడటం, చికిత్స అందించి వాటికి పునరావాసం ఏర్పాటు చేయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారు. ఇలాంటి ఒక కృత్రిమ అడవిని ఏర్పాటు చేసి వన్యప్రాణుల్ని కాపాడాలన్నది మంచి ఆలోచన. మీరందరూ దీనిని సందర్శించాలి. ఇదో గొప్ప అనుభవం' అని అమితాబ్ బచ్చన్ పేర్కొన్నారు.

అనంత్-రాధికల ప్రీవెడ్డింగ్ వేడుకల్లో రణ్‌బీర్-అలియా, దీపికా-రణ్‌వీర్ సింగ్, కరీనా కపూర్-సైఫ్ అలీ ఖాన్ తదితర బాలీవుడ్ జంటలు ప్రత్యేకంగా డాన్స్ చేసి సందడి చేశాయి. బాలీవుడ్ ఖాన్స్ త్రయం సల్మాన్, షారుక్, ఆమిర్‌తో కలిసి హీరో రామ్ చరణ్ 'నాటునాటు' పాటకు స్టెప్పులేసి అలరించారు. వీరితోపాటు అక్షయ్‌కుమార్, జాన్వీ కపూర్, అనన్య పాండే, సారా అలీఖాన్, ఖుషీ కపూర్..తదితరులు ఈ వేడుకకు హాజరయ్యారు.

## శ్రీలీలను వెంకీ కుడుముల పక్కన పట్టారా?

తెలుగు నటి శ్రీలీల గత సంవత్సరం అంతా తెలుగు సినిమాలతో చాలా బిజీగా ఉండేది. ఆమె తేదీలు దొరకటమే కష్టంగా వుంది అని పరిశ్రమలో ఒక టాక్ కూడా నడిచింది. నటుడు నితిన్ అయితే ఆమె ఎప్పుడు షూటింగ్ వస్తుంది, ఎన్ని గంటలు షూటింగ్ చేస్తుంది, ఆ కేటాయించిన గంటల్లో ఆమెతో ఎటువంటి సన్నివేశాలు చెయ్యాలి అనేదే మాకు పెద్ద ఛాలెంజ్ అని తన 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' చిత్ర ప్రచార సభల్లో చెప్పారు కూడా. మరి అంత బిజీగా వున్న శ్రీలీలని దర్శకుడు వెంకీ కుడుములతో చెయ్యబోయే తదుపరి సినిమాలో కూడా ఎందుకు తీసుకున్నారు అంటే దర్శకుడు వెంకీ ఆమే కావాలి అన్నారని, చెప్పారు నితిన్. గత సంవత్సరం శ్రీలీల చేసిన సినిమాలు వరసగా 'స్కంద', 'భగవంత్ కేసరి', 'ఆదికేశవ; 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' అలాగే ఈ సినిమాలకి కొనసాగింపుగా ఈ సంవత్సరం సంక్రాంతికి 'గుంటూరు కారం' విడుదలైంది. రెండు రోజుల క్రితం నితిన్, వెంకీ కుడుముల సినిమా 'రాబిన్ హుడ్' సినిమా షూటింగ్ గురించి తాజా సమాచారం ఇస్తూ ఒక అధికారిక ప్రకటన వచ్చింది. ఏమైందో ఏమో కానీ అందులో శ్రీలీల పేరు లేకపోవటం ఆసక్తికరం. ఈ సినిమాలో మొదట రష్మిక మందన్న కథానాయిక అనుకున్నారు, కానీ ఆమె అప్పట్లో హిందీ సినిమాతో బిజీగా ఉండటం వలన ఆమెకి బదులు శ్రీలీలని తీసుకున్నారు. కానీ ఇప్పుడు పంపిన అధికారిక ప్రకటనలో తారాగణం అంటూ నితిన్, వెన్నెల కిశోర్, రాజేంద్ర ప్రసాద్ పేర్లు చెప్పారు కానీ శ్రీలీల పేరు అందులో లేదు. అంటే శ్రీలీల ఈ మూవీ నుండి తప్పుకున్నారా, లేక నితిన్ అప్పుడు అన్న మాటలకి దర్శకుడు వేరే కథానాయికని పెట్టుకోవాలని అనుకున్నారా అనే విషయం మీద పరిశ్రమలో చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా నితిన్ కి మంచి విజయాన్ని 'భీష్మ' సినిమాతో అందించిన దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో చేస్తున్న'రాబిన్‌హుడ్' చిత్రంలో పూర్తిగా భిన్నమైన లుక్ లో నితిన్ అలరించనున్నారు అని ఆ అధికార ప్రకటనలో చెప్పారు. ఈ సినిమా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు. ఇది ఒక వినోదాత్మక యాక్షన్ అడ్వెంచర్ అని ఇందులో నితిన్ దొంగగా నటిస్తున్నారని చెప్పారు. ఆ ప్రకటన ప్రకారం దర్శకుడు ఇప్పుడు ఇంటర్వెల్ యాక్షన్ ఎపిసోడ్ షూటింగ్ ప్రారంభించారు అని తెలిసింది. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ ఈ యూనిక్ యాక్షన్ బ్లాక్‌ని ఇంట్రస్టింగ్‌గా డిజైన్ చేస్తున్నట్టుగా తెలిసింది.



# చిప్ తయారీలో అంతర్జాతీయ స్థాయికి భారత్.....!



**న్యూఢిల్లీ :** సెమీకండక్టర్ తయారీ రంగంలో వచ్చే అయిదేళ్లలో అంతర్జాతీయ స్థాయికి భారత్ చేరుకుంటుందని కేంద్ర ఐటీ, టెలికాం మంత్రి అశ్వనీ వైష్ణవ్ పేర్కొన్నారు. కొత్త ఫ్యాబ్‌లు, ప్లాంట్‌లు ఏర్పాటు చేసేందుకు తయారీదార్లకు 10 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.83,000 కోట్ల) ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఏర్పాటవుతున్న యూనిట్లు అందుబాటులోకి వస్తే, చిప్ రంగంలో తైవాన్, దక్షిణ కొరియా, చైనాల ఆధిపత్యం తగ్గుతుందనే ధీమాను మంత్రి వ్యక్తం చేశారు. తయారీదార్ల కొత్త ఫ్యాబ్‌లు (సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ ప్లాంట్‌లు) ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం ప్రకటించిన విధానాలు అంతర్జాతీయ పెట్టుబడిదార్లను ఆకర్షిస్తున్నాయని, అందుకే అనుబంధ రంగాల్లోనూ భారీగా పెట్టుబడులు వస్తున్నట్లు వెల్లడించారు. వాహనాలలో సెన్సర్ల దగ్గర నుంచి కంప్యూటర్లు, మొబైల్ ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్స్‌లో సెమీకండక్టర్ చిప్‌సెట్లు కీలకం కావడం గమనార్హం. సెమీకండక్టర్ తయారీ రంగంలో అధిక వాటా దక్కించుకునే లక్ష్యంగా మైక్రాన్, టాటా సహా నాలుగు సంస్థలకు రూ.76,000 కోట్ల ప్రోత్సాహకాలను మోదీ ప్రభుత్వం ఇచ్చింది. అంతర్జాతీయ డిజైన్ నిపుణుల్లో మూడింట ఒకవంతు భారత్‌లోనే ఉన్నట్లు వైష్ణవ్ తెలిపారు. వీరి ప్రతిభను సద్వినియోగం చేసుకోవడం ద్వారా చైనాపై ఆధారపడటం తగ్గించుకోవాలని అమెరికా వంటి పశ్చిమ దేశాలు చూస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. అందువల్లే చైనాకు ప్రత్యామ్నాయ కేంద్రంగా భారత్ నిలుస్తోందని అన్నారు. మనదేశంలో 3 సెమీకండక్టర్ ప్లాంట్ల ఏర్పాటుకు గతవారం కేంద్ర మంత్రివర్గం కంపెనీలకు అనుమతులు ఇచ్చింది. రూ.1.26 లక్షల కోట్ల పెట్టుబడితో టాటా గ్రూప్ 2 ప్లాంట్‌లు, సీజీ పవర్ ఒక ప్లాంటు ఏర్పాటు చేయనున్నాయి. గుజరాత్ ధొలేరా, అస్సోంలోని మారిగావ్‌లో టాటా గ్రూప్, గుజరాత్‌లోని సనంద్‌లో సీజీ పవర్ ప్లాంట్‌లు పెడుతున్నాయి.

దేశంలో ఏర్పాటవుతున్న యూనిట్లు అందుబాటులోకి వస్తే, చిప్ రంగంలో తైవాన్, దక్షిణ కొరియా, చైనాల ఆధిపత్యం తగ్గుతుందనే ధీమాను మంత్రి వ్యక్తం చేశారు.

# ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్ ద్వారా యూపీఐ చెల్లింపులు...




ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్ యుపీఐ సర్వీసుని ప్రారంభించింది. యాక్సిస్ బ్యాంక్ సహకారంతో ఈ-కామర్స్ సంస్థ ఈ సేవను ప్రారంభించింది.ప్రస్తుతం ఈ సేవ కేవలం ఆండ్రాయిడ్ వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. Supercoins, Cashback, Milestone Benefits, బ్రాండ్ వోచర్‌లు వంటి ప్రయోజనాలు Flipkart UPIలో అందుబాటులో ఉంటాయి. కంపెనీ గత సంవత్సరం నుండి తన యూపీఐ సర్వీసును పరీక్షిస్తోంది. ఇప్పుడు సామాన్యుల కోసం దీన్ని ప్రారంభించింది. కొత్త యూపీఐ సేవ ఫ్లిప్‌కార్ట్ కస్టమర్‌లకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఫ్లిప్‌కార్ట్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు వారు చెల్లింపు చేయడానికి ఇతర అప్లికేషన్‌లకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్ కంపెనీ తన వినియోగదారులకు దాని స్వంత యూపీఐ సేవను అందించడానికి ఇది ఒక పెద్ద అడుగు.

# వడ్డీరేట్ల పెంపుతో టర్మ్ డిపాజిట్ల వైపు మొగ్గు...!



**న్యూఢిల్లీ :** బ్యాంకుల్లో వడ్డీ రేట్లు పెరిగిన నేపథ్యంలో ఖాతాదారులు టర్మ్ సేవింగ్స్ ప్లాన్ల వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం బ్యాంకు డిపాజిట్లలో వీటి వాటా 2023 మార్చిలో ఉన్న 57.2 శాతం నుంచి 2023 డిసెంబర్ నాటికి 60.3 శాతానికి పెరిగిందని ఆర్‌బీఐ తాజా వివరాలు వెల్లడిస్తున్నాయి.2023 ఏప్రిల్- డిసెంబర్ మధ్య పెరిగిన డిపాజిట్లలో టర్మ్ డిపాజిట్ల వాటానే 97.6 శాతంగా ఉంది. అదే సమయంలో కరెంట్ ఖాతా, సేవింగ్స్ ఖాతాల డిపాజిట్లు మాత్రం తగ్గాయి.ఏడు శాతం కంటే ఎక్కువ వడ్డీ రేటు కలిగిన టర్మ్ డిపాజిట్ల వాటా 2023 డిసెంబరులో మొత్తం టర్మ్ డిపాజిట్లలో 61.4 శాతానికి చేరింది. మార్చిలో ఇది 33.7 శాతంగా ఉంది. దాదాపు ఏడాది కాలంగా ఆర్‌బీఐ రెపోరేటును 6.5 శాతం వద్ద స్థిరంగా కొనసాగిస్తోంది. చివరిసారి 2023 ఫిబ్రవరిలో 6.25 శాతం నుంచి 6.5 శాతానికి పెంచింది. 2022 నుంచి పలు దఫాల్లో దాదాపు 250 బేసిస్ పాయింట్లు పెంచిన విషయం తెలిసిందే. 2023 అక్టోబరు - డిసెంబరు మధ్య పెరిగిన టర్మ్ డిపాజిట్లలో మూడోవంతు రూ.లక్ష నుంచి రూ.1 కోటి మధ్య ఉన్నవేనని ఆర్‌బీఐ వెల్లడించింది. అంతక్రితం త్రైమాసికంలో ఈ వాటా 46.5 శాతంగా ఉంది. డిపాజిట్లలో మహిళా ఖాతాదారుల వాటా 2023 సెప్టెంబరులో 20.2 శాతంగా ఉండగా.. అది డిసెంబరు నాటికి 20.6 శాతానికి చేరింది. మరోవైపు డిసెంబరు డిపాజిట్లలో సీనియర్ సిటిజెన్స్ వాటా 20.1 శాతంగా ఉంది.

# పొంతన లేని జిడిపి లెక్కలు.....

న్యూఢిల్లీ : మోడీ సర్కార్ విడుదల చేసిన జిడిపి గణంకాలకు వాస్తవ అంశాలకు అమాంతం పొంతన లేకుండా పోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో జిడిపి 8.4 శాతం పెరిగిందని ఎన్ఎస్ఒ గణంకాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ లెక్కలు గృహ వినియోగం, ఆదాయ పరిస్థితి వాస్తవికతకు విరుద్దంగా ఉన్నాయి. గడిచిన నాలుగేళ్లలో వాస్తవ ఆదాయాల్లో కేవలం 3 శాతం మాత్రమే పెరుగుదల ఉందని 11 ఏళ్ల తర్వాత జాతీయ వ్యయ సర్వే (2022-23) విడుదల చేసిన లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్)లో పేర్కొంది. అనేక వినియోగదారుల ఉత్పత్తుల కంపెనీలు డిమాండ్ కొరతను ఎదుర్కొంటున్నాయి. దిగుమతుల్లోనూ భారీ తగ్గుదల, వ్యయాల్లో తగ్గుదలను సూచిస్తున్నాయి. 2023 డిసెంబర్ త్రైమాసికంలో దిగుమతులు 22 శాతం పతనం కాగా.. ఎగుమతుల్లో స్వల్పంగా 0.9 శాతం పెరుగుదల ఉంది. ప్రయివేటు వినిమయంలో 0.7 శాతం తగ్గుదల నమోదయ్యింది. ప్రజల ఆదాయాలు, వ్యయాలు, పొదుపు అంశాలు బలమైన వృద్ధిని తెలియజేస్తాయి. కానీ.. ప్రజల ఆదాయాల్లో పెద్ద పెరుగుదల లేకపోగా.. ఖర్చులు అమాంతం పెరగడంతో పొదుపు స్థాయిలు తగ్గిపోయాయి. రోడ్లు, రైల్వేలు, రక్షణ రంగ తదితర మౌలిక రంగ వసతులు 5.2 శాతం పెరుగుదల ఉండొచ్చని ఇటీవలి మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రం అంచనా వేసింది. ఇది కూడా దేశీయ డిమాండ్‌లో తగ్గుదలను చూపిస్తోంది. గడిచిన జనవరిలో ఎనిమిది ప్రధాన మౌలిక రంగాల వృద్ధి 3.6 శాతానికి పరిమితమై.. 15 నెలల కనిష్ఠాన్ని తాకింది. రిఫైనరీ ఉ



త్పత్తులు, ఎరువులు, ఉక్కు, విద్యుత్తు తదితర రంగాల్లో పనితీరు పేలవంగా చోటు చేసుకుందని స్వయంగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన గణంకాల్లో తేలింది. దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఏకంగా 40.27 శాతం వాటా కలిగిన ఎనిమిది అత్యంత ప్రాధాన్యత కలిగిన రంగాలు పేలవ ప్రదర్శన కనబర్చుతుంటే.. మరోవైపు జిడిపి భారీగా పెరగడం బిజెపి సర్కార్ మాయాజాలాన్ని స్పష్టం చేస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్‌లో ఎఫ్‌డిఐల్లో ఏకంగా 13 శాతం పతనమై 32.03 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి.

# ఏఐతో బీపీఓ ఉద్యోగులకు అధిక ముప్పు



**ముంబయి :** జనరేటివ్ కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ (బీపీఓ) రంగంలో పనిచేసే ఉద్యోగులు అధికంగా ముప్పు ఎదుర్కోనున్నారని ఐటీ పరిశ్రమ సంఘం నాస్‌కామ్ ఛైర్మన్ రాజేశ్ నంబియార్ పేర్కొన్నారు.భారత టెక్ పరిశ్రమలో కీలకమైన సాఫ్ట్‌వేర్ సేవల విభాగం మాత్రం ఈ విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం కాగ్నిజెంట్ ఇండియాకు ఛైర్మన్, ఎండీగా నంబియార్ వ్యవహరిస్తున్నారు. పుణెలో ఒక సెమినార్‌లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ ముప్పును గ్రహించి, 48.9 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.06 లక్షల కోట్ల) విలువైన దేశీయ బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) పరిశ్రమ త్వరగా తన విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. 250 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 20.75 లక్షల కోట్ల) విలువైన దేశీయ ఐటీ పరిశ్రమపైనా కొంతమేర ఏఐ ప్రభావం చూపొచ్చని పేర్కొన్నారు. 'తమ పనిలో ఏఐను వినియోగించలేని ఐటీ నిపుణులను.. ఏఐ వినియోగించే వారు భర్తీ చేసే ప్రమాదం ఉంద'ని నంబియార్ అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఖాతాదారుల అవసరాల కోసం ఏఐ ఆధారిత నైపుణ్యాలను తమ ఉద్యోగులకు కల్పించడానికి ఐటీ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.

# హరిత బాండ్లతో నిధుల సమీకరణ...!




**న్యూఢిల్లీ :** బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) అనుబంధ తనఖా సంస్థ ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో హరిత బాండ్లను జారీ చేయడం ద్వారా నిధుల్ని సమీకరించబోతోంది.పర్యావరణ అనుకూల నివాస ప్రాజెక్టులకు ఫైనాన్స్ అందించేందుకు ఈ నిధులు వినియోగిస్తామని తెలిపింది. వచ్చే ఏడాది పర్యావరణ హిత నివాస ప్రాజెక్టులకు రుణాలు ఇవ్వాలన్నది తమ ప్రతిపాదన అని, ఇందుకోసం హరిత బాండ్లు జారీ చేయడం ద్వారా సమీకరించిన నిధులను వినియోగిస్తామని ఎల్ఐసీ హౌసింగ్ ఎండీ, సీఈఓ త్రిభువన్ అధికారి వెల్లడించారు. సంస్థ బోర్డు సమావేశం ఈ నెల 7న నిర్వహించబోతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రుణాలు లేదా రిడీమబుల్ నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లు, జీరో కూపన్డ్ బాండ్లు, సబార్డినేట్ డెట్, టైర్-2 బాండ్లు లేదా నియంత్రణ సంస్థలు ఆమోదించిన ఇతర పద్ధతుల్లో నిధుల సమీకరణకు ఆమోదం తెలిపేందుకు ఈ సమావేశం నిర్వహించబోతోంది.

# కేంద్రానికి పిఎస్‌యుల బంఫర్ డివిడెండ్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాలను ప్రయివేటు శక్తులకు తెగనమ్మడానికి ఎప్పుడూ ఆసక్తి చూపే బిజెపి సర్కార్ ఖాజానాకు అవే పిఎస్‌యులు ఊపిరిపోస్తున్నాయి. ఆ సంస్థలు అంచనాలు మించి రికార్డ్ స్థాయిల్లో డివిడెండ్‌లను అందిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) తొలి 11 మాసాల్లో కేంద్ర ప్రభుత్వానికి విత్త యేతర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు భారీ డివిడెండ్‌ను ప్రకటించాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ గణంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.51,556 కోట్ల డివిడెండ్‌ను అందించాయి. 2023-24లో విత్తయేతర పిఎస్‌యుల నుంచి రూ.50వేల కోట్ల డివిడెండ్ రావొచ్చని గత నెలలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రం అంచనా వేయగా.. అంతక్రితం తొలుత రూ.43,000 కోట్లు అందవచ్చని మోడీ సర్కార్ భావించింది. ఈ అంచనాలకు భిన్నంగా ఇప్పటికే అత్యధికంగా డివిడెండ్ ఆదాయాలు కేంద్రానికి చేరాయి.మరో నెల రోజుల్లో ఇంకా అనేక సంస్థలు డివిడెండ్‌ను ప్రకటించనున్నాయి. "ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి డివిడెండ్ రాబడి 55,000 కోట్లకు మించవచ్చు. విద్యుత్ వంటి వివిధ రంగాలలోని సిపిఎస్‌యులు బాగా పనిచేస్తున్నాయి." అని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23లో రూ.43వేల కోట్ల డివిడెండ్ అంచనా వేయగా.. రూ.59,533 కోట్లు ప్రకటించాయి. ఇంతక్రితం 2021-22లో రూ.46వేల కోట్లు అంచనా వేయగా రూ.59,294 కోట్లు, 2020-21 లో రూ.34,717 కోట్లు అంచనా వేయగా.. రూ.39,608 కోట్ల చొప్పున డివిడెండ్‌ను అందించాయి. ఒఎన్‌జిసి, గెయిల్, ఎన్‌టిపిసి, కోల్ ఇండియా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఐఆర్ఎఫ్‌సి, సెయిల్‌తో సహా సిపిఎస్ఇలు ఈ ఆర్థిక సంవత్సరంలో డివిడెండ్‌లను అందించి ప్రభుత్వ



ఆదాయాన్ని పెంచాయి. మోడీ సర్కార్ బడ్జెట్‌లో అంచనా వేసిన దాని కంటే అధిక డివిడెండ్‌ను అందించి ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్నాయి. అయినా.. బిజెపి ప్రభుత్వం ఏడాదికేడాదికి పిఎస్‌యుల్లో వాటాల విక్రయాన్ని వేగవంతం చేయడం గమనార్హం.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.51,556 కోట్ల డివిడెండ్‌ను అందించాయి. 2023-24లో విత్తయేతర పిఎస్‌యుల నుంచి రూ.50వేల కోట్ల డివిడెండ్ రావొచ్చని గత నెలలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రం అంచనా వేయగా.. అంతక్రితం తొలుత రూ.43,000 కోట్లు అందవచ్చని మోడీ సర్కార్ భావించింది. ఈ అంచనాలకు భిన్నంగా ఇప్పటికే అత్యధికంగా డివిడెండ్ ఆదాయాలు కేంద్రానికి చేరాయి.మరో నెల రోజుల్లో ఇంకా అనేక సంస్థలు డివిడెండ్‌ను ప్రకటించనున్నాయి. "ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి డివిడెండ్ రాబడి 55,000 కోట్లకు మించవచ్చు.

# మోడీకి రేవంత్ చేసిన విజ్ఞప్తులు ఇవే



**రెండు రోజుల తెలంగాణ పర్యటనకు విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందించిన విజ్ఞప్తులు ఇవే:**

– ఎన్టీపీసీలో 4000 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం ఉంటే గత ప్రభుత్వం 1600 మెగావాట్లు మాత్రమే సాధించింది. మిగిలిన 2400 మెగావాట్ల ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని అనుమతులు ఇస్తాం.

– హైదరాబాద్ మెట్రో విస్తరణ అభివృద్ధికి, మూసీ ప్రక్షాళన రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సహకరించండి.

– తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భూసేకరణ, నీటి వాటాల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ప్రధాని జోక్యం చేసుకోవాలి.

– హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిపై అమ్రాబాద్ ఫారెస్ట్ ఏరియా మీదుగా ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణానికి సహకరించాలి. 2022 – 23లోనే కేంద్ర ప్రభుత్వం డీపీఆర్ తయారీకి రూ,3 కోట్లు మంజూరు చేసింది. రూ.7700 కోట్ల అంచనా ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలి. ఈ కారిడార్ తో అటు శ్రీశైలం వెళ్లే యాత్రికులతో పాటు హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రకాశం జిల్లా వరకు 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దక్షిణ తెలంగాణ వైపు రవాణ మార్గాలు విస్తరిస్తాయి.

– రాష్ట్రంలో నూటికి నూరు శాతం ఇంటింటికీ నల్లా నీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి. దాదాపు పది లక్షల కుటుంబాలకు ఇప్పటికీ నల్లా నీళ్లు అందటం లేదు. సమీపంలోని నీటి వనరుల ద్వారా గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల జీవన్ మిషన్ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్య , పోలీస్ కమిషనరేట్ల సంఖ్యకు అనుగుణంగా ఐపీఎస్ క్యాడర్ రివ్యూ చేయాలి. కేంద్ర హెూంశాఖ 2016లో తెలంగాణకు 76 ఐపీఎస్ కేడర్ పోస్టులను మంజూరు చేసింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ, పెరిగిన జనాభాను బట్టి రాష్ట్రంలో పోలీసు అధికారుల అవసరం పెరిగింది. అత్యవసరంగా 29 పోస్టులను అదనంగా కేటాయించాల్సి ఉంది. ఐపీఎస్ క్యాడర్ రివ్యూను అత్యవసర అంశంగా పరిగణించాలి. వీలైనంత త్వరగా పోస్టులు మంజూరు చేయాలి.

– హైదరాబాద్ – రామగుండం, హైదరాబాద్ – నాగ్‌పూర్ రహదారిపై రక్షణ శాఖ భూముల మీదుగా ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. వీటితో పాటు కారిడార్ల నిర్మాణానికి కంటోన్మెంట్ ఏరియాలో 178 ఎకరాలు, 10 టీఎంసీల కేశవపురం రిజర్వాయర్ నిర్మాణానికి పొన్నాల గ్రామ సమీపంలోని 1350 ఎకరాల మిలిటరీ డెయిరీ ఫామ్ ల్యాండ్స్ (తోఫెఖానా) రాష్ట్రానికి బదిలీ చేయాలి. లీజు గడువు ముగిసిన శామీర్? పేటలో ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ (1038 ఎకరాల) భూములను తిరిగి అప్పగించాలి.


– ఐఐటీ, నల్సార్, సెంట్రల్ యూనివర్సిటీ తో పాటు ఎన్నో పేరొందిన పరిశోధన, ఉన్నత విద్యా సంస్థలు హైదరాబాద్ లో ఉన్నాయి. అత్యున్నత విద్యా సంస్థలు అందరికీ అందుబాటులో ఉండాలని ప్రతి రాష్ట్రంలో ఒక ఐఐఎం నెలకొల్పాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. అందులో భాగంగా హైదరాబాద్లో ఐఐఎం (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్) నెలకొల్పాలి. అందుకు అవసరమైనంత స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుంది.

– నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నాం. 5259 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర వాటాగా రాష్ట్రానికి రావాల్సిన రూ.347.54 కోట్లను వెంటనే విడుదల చేయాలి.

– భారత్ మాల పరియోజన జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా తెలంగాణకు ప్రయోజనంగా ఉండే ఎనిమిది ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. కల్వకుర్తి – కొల్లాపూర్, గౌరెల్లి – వలిగొండ, తొర్రూర్ – నెహ్రూనగర్, నెహ్రూనగర్ – కొత్తగూడెం, జగిత్యాల – కరీంగర్ ఫోర్ లేన్, జడ్చర్ల – మరికల్ ఫోర్ లేన్, మరికల్ – డియసాగర్ నిలిచిపోయిన టెండర్ల ప్రక్రియకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలి.


– తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకారాన్ని కోరుతున్నాం. ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ లో ప్రధాన పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. సెమీ కండక్టర్లు, డిస్ ప్లే మ్యానుఫ్యాక్షరింగ్ రంగంలో కొత్త శకానికి నాంది పలికేందుకు ఇండియా సెమీ కండకర్ల మిషన్లో భాగంగా కేంద్రం సాయం అందించాలి.

# సుప్రీం కోర్టును ఆశ్రయించిన 'అనర్హ' ఎమ్మెల్యేలు



న్యూఢిల్లీ : హిమాచల్ ప్రదేశ్‌లో అనర్హతకు గురైన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంగళవారం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తమపై స్పీకర్ కుల్దీప్‌సింగ్ అనర్హత వేటు వేయడం అక్రమం, రాజ్యాంగ విరుద్ధమని ఎమ్మెల్యేలు అంటున్నారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేశారు. బీజేపీ సభ్యుడు హర్ష్‌మహాజన్‌కు ఓటు వేయడంతో ఆ అభ్యర్థి గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ సింఘ్వీ ఓడిపోయారు. ఆరుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ కుల్దీప్ సింగ్‌ను కాంగ్రెస్ పార్టీ కోరింది. దాంతో ఆరుగురిపై స్పీకర్ అనర్హత వేటు పడింది. తమ అనర్హతపై గతవారం హిమాచల్ ప్రదేశ్ హైకోర్టులో కూడా పిటిషన్ దాఖలు చేశారు.

# జడ్జిగా రాజీనామా.. గంటలోనే బిజెపిలో చేరిక



కోల్‌కత: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా రాజీనామా చేసిన కొద్ది గంటలకే అభిజిత్ గంగోపాధ్యాయ తాను బిజెపిలో చేరుతున్నట్లు మంగళవారం ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కూరుకుపోయిందని, తాను చివరి వరకు ఆ పార్టీపై పోరాడతానని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ప్రకటించారు. తాను మార్చి 7న బిజెపిలో చేరుతున్నట్లు ఆయన వెల్లడించారు. బెంగాల్‌లో టిఎంసి అవినీతిపై పోరాడుతున్న జాతీయ పార్టీ అయిన బిజెపిలో చేరాలని తాను నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా విద్యారంగానికి సంబంధించి గంగోపాధ్యాయ ఇచ్చిన అనేక తీర్పులు చర్చనీయాంశమయ్యాయి. ఆయన తీర్పులు అధికార టిఎంసికి రాజకీయంగా ఇబ్బందులను తెచ్చిపెట్టాయి. రానున్న లోకక్‌సభ ఎన్నికలలో పటీ చేస్తారా అన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమివ్వలేదు. తాను పోటీ చేయాలా వద్దా అన్నది బిజెపి నాయకత్వం నిర్ణయిస్తుందని, పార్టీ నాయకత్వం తీసుకునే ఎటువంటి నిర్ణయానికైనా తాను కట్టుబడి ఉంటానని ఆయన తెలిపారు. టిఎంసి చేసే అన్యాయాలు, అవినీతిపై తాను పోరాడతానని ఆయన చెప్పారు. కొంతకాలంగా టిఎంసి నాయకులు తనను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని గంగోపాధ్యాయ తెలిపారు. న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు నచ్చకపోయినంత మాత్రాన ఆయనపై ఎలా దుర్భాషలాడతారని ప్రశ్నించారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యవహారాలే తాను బిజెపిలో చేరడానికి కారణమని ఆయన అన్నారు. తాను బిజెపిలో చేరి టిఎంసిపై పోరాడతానని ఆయన చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో టిఎంసికి నూకలు దగ్గరపడ్డాయని ఆయన హెచ్చరించారు. 2009 లోక్‌సభ ఎన్నికల తర్వాత సిపిఎం నాయకత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ కనుమరుగై పోయిందని, ఆ తర్వాత 2011 అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలు చిత్తుగా ఓడిపోడిపోయాయని ఆయన చెప్పారు. టిఎంసికి కూడా అదే గతి పడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. బిజెపిలో చేరాలని కొద్ది రోజుల క్రితమే నిర్ణయం తీసుకున్నానని ఆయన చెప్పారు. గత కొద్ది రోజులుగా తాను సెలవులో ఉన్నానని, బిజెపితో సంప్రదింపులు జరుపుతున్నానని ఆయన తెలిపారు. టిఎంసి పోరాడేందుకు ఇదే సరైన వేదికని భావించానని ఆయన చెప్పారు. బిజెపి నాయకుడు, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారిపై వచ్చిన అవినీతి ఆరోపణలను గురించి విలేకరులు ప్రశ్నించగా ఆయనను ఇరికించేందుకే టిఎంసి నాయకులు ఆ కేసును సువేందు అధికారిపై బనాయించారని గంగోపాధ్యాయ అన్నారు.

# నిత్యానంద అయినా ఓకే కానీ.. ధర్మపురి అర్వింద్ అయితే వద్దు.. నిజామాబాద్ బీజేపీలో అసమ్మతి గళం!

సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు టికెట్ కేటాయించడంతో బీజేపీలో అసమ్మతి సెగ రాజుకుంది. మళ్లీ నిజామాబాద్ టికెట్‌ను అర్వింద్‌కే కేటాయించడంపై బీజేపీ నేత మీసాల శ్రీనివాస్, కార్పొరేటర్ మీసాల సవిత వ్యతిరేకిస్తున్నారు. డేరా బాబా, నిత్యానందకు టికెట్ ఇచ్చినా ఓకే కానీ.. ధర్మపురి అర్వింద్‌కు మాత్రం ఇవ్వవద్దని పార్టీ అధినాయకత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ నుంచే కాదు.. అసలు లోక్‌సభ బరిలో ఉండటానికే అనర్హుడు అని మీసాల శ్రీనివాస్ విమర్శించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బిఆర్ఎస్ యత్నం : బండి సుధాకర్ గౌడ్



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బిఆర్ఎస్ ప్రయత్నిస్తోందని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఐదారు నెలల తర్వాత కాంగ్రెస్ సర్కారు ఉండదని బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని అన్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టే ఆలోచనలు చేస్తున్న కెసిఆర్ పై సమగ్ర విచారణ జరపాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే బిఆర్ఎస్ ఎంఎల్ఎలలో చాలామంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారన్న సంగతి తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. చాలా మంది పార్టీ నుంచి వెళ్లిపోతారనే భయంతోనే నిస్సహాయ పరిస్థితుల్లో కెసిఆర్ పైపైకి బీరాలు పలుకుతున్నారని సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు మాత్రమే ఫైనల్ అనే విషయాన్ని మాజి సిఎం కెసిఆర్ మరిచిపోతే ఎలా?' అని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా పూర్తి మెజారిటీతో ఏర్పాటై, ప్రజా రంజకంగా పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కెసిఆర్ ఎలా పడగొడతారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కు ఉన్న సంఖ్యాబలం, ప్రజాబలం చూస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు. అయితే, కెసిఆర్ ఇంకా తానే సిఎం అనే భ్రమల్లో ఉన్నాడని, తమ కుటుంబం అక్రమంగా సంపాదించిన డబ్బుతో కెసిఆర్ ఓ సినిమా తీసి, అందులోనైతే తానే సిఎం పాత్రలో నటించవచ్చు కదా.. అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే కెసిఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి కూడా పాల్గొన్నారు.

## మంత్రి రోజాకు మరోసారి టికెట్ ఇస్తే పనిచేయం..

# నియోజకవర్గ నేతల హెచ్చరిక



అమరావతి : ఆంధ్రప్రదేశ్ టూరిజం, క్రీడల శాఖ మంత్రి రోజా పై ఆమె అనుచరులు మండిపడుతున్నారు. ఆమెకు టికెట్ ఇవ్వొద్దని వైసీపీ అధిష్టానానికి మంగళవారం విజ్ఞప్తి చేశారు. నగరి నియోజకవర్గానికి చెందిన ఐదు మండలాల వ్యతిరేక వర్గం నాయకులు మీడియా సమావేశాన్ని నిర్వహించి నియోజకవర్గంలో రోజాకుకాకుండా మరెవరికైనా టికెట్ ఇవ్వాలని కోరారు. రెండు సార్లు పార్టీ, అభ్యర్థి రోజాను గెలిపించుకునేందుకు అహర్నిశలు, శక్తివంచన లేకుండా పనిచేశామని తెలిపారు. ఐరన్ లెగ్ పేరున్న రోజాను నియోజకవర్గ వైసీపీ నాయకులంతా గోల్డెన్ లెగ్ గా మార్చామని పేర్కొన్నారు. అయితే నియోజకవర్గంలో ఆమె సోదరులు చేస్తున్న దోపిడికి అడ్డుగా ఉన్నామనే అక్కసుతో మమ్మల్ని దూరంగా పెట్టి వేధిస్తున్నారని వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, పుత్తూరు నేత అమ్ములు, లక్ష్మీపతిరాజు, మండలాల వైసీపీ నాయకులు ఆరోపించారు. వ్యతిరేకవర్గం నేతలు ఎవరైనా సరే అవినీతి పాల్పడి ఉంటే దానిపై రోజాతో చర్చకు సిద్దమని సవాల్ విసిరారు. వైసీపీ అధికారంలోకి రాకముందు అప్పుల్లో ఉన్న రోజా మంత్రి అయ్యాక ఎంత సంపాదించిందో అందరికీ తెలుసని విమర్శించారు. పుత్తూరు నగరిలో ఎక్కడ చూసినా భూ కబ్జాలు, దౌర్జన్యాలు, దోపిడీలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మంత్రి రోజాకు మరోసారి వైఎస్ఆర్ అధిష్టానం సీటు ఇస్తే తాము పనిచేయాబోమని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు సహకారాన్నందించండి



హైదరాబాద్: హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుతో పాటు మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సహకరించాలని ప్రధాని మోడీకి సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఇంటింటికీ నల్లా నీళ్లు అందించేందుకు కేంద్ర జలజీవన్ మిషన్ నిధులు కేటాయించాలని కోరారు. మరో 29 మంది ఐపిఎస్‌లను రాష్ట్రానికి కేటాయించాలని కోరారు. రాష్ట్రానికి రెండు రోజుల పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీకి 11 అంశాలపై సిఎం రేవంత్ స్వయంగా వినతిపత్రం అందజేశారు. కేంద్రంతో ఘర్షణ పడబోమని సిఎం రేవంత్ స్పష్టం చేసిన సంగతి విదితమే. రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉందని బహిరంగంగా వెల్లడించిన సిఎం పలు అంశాల్లో సహకరించాలని ప్రధాని మోడీని కోరారు. ఎన్‌టిపిసిలో 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం ఉండగా, గత ప్రభుత్వం 1600 మెగా వాట్లు మాత్రమే సాధించిందని గుర్తు చేశారు. మిగిలిన 2 వేల 400 మెగావాట్ల ఉత్పత్తికి కేంద్రం సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని అనుమతులు ఇస్తామని వెల్లడించారు. మరోవైపు తుమ్మిడిహట్టి ఎత్తిపోతల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామన్న సిఎం, భూసేకరణ, నీటి వాటాల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు జోక్యం చేసుకోవాలని ప్రధాని మోడీని కోరారు. హైదరాబాద్‌శ్రీశైలం జాతీయ రహదారిపై అమ్రాబాద్ ఫారెస్ట్ ఏరియా మీదుగా ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికోసం 2022-23 లోనే కేంద్ర ప్రభుత్వం డిపిఆర్ తయారీకి 3 కోట్లు మంజూరు చేసిందని, 7 వేల 700 కోట్ల అంచనా ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలని కోరారు. 'రాష్ట్రంలో నూటికి నూరు శాతం ఇంటింటికీ నల్లా నీటిని అందించేందుకు జల జీవన్ మిషన్ నిధులు కేటాయించండి. సుమారు 10లక్షల కుటుంబాలకు ఇప్పటికీ నల్లా నీళ్లు అందటం లేదు. తెలంగాణలో పెరిగిన జిల్లాలు, పోలీస్ కమిషనరేట్లకు అనుగుణంగా ఐపిఎస్ క్యాడర్‌ను అత్యవసరంగా సమీక్షించండి. కేంద్ర హెూంశాఖ 2016లో తెలంగాణకు 76 ఐపిఎస్ కేడర్ పోస్టులను మంజూరు చేసింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ, పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి మరో 29 పోస్టులను ఇవ్వాలి.' అని ప్రధాని మోడీని రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌రామగుండం, హైదరాబాద్ నాగ్‌పూర్ రహదారిపై రక్షణ శాఖ భూముల మీదుగా ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. వీటితో పాటు కారిడార్ల నిర్మాణానికి కంటోన్మెంట్ ఏరియాలో 178 ఎకరాలతో పాటు 10 టిఎంసిల కేశవపురం రిజర్వాయర్ నిర్మాణం కోసం పొన్నాల గ్రామ సమీపంలోని 1350 ఎకరాల మిలిటరీ డెయిరీ ఫామ్ ల్యాండ్స్ రాష్ట్రానికి బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. లీజు గడువు ముగిసిన శామీర్‌పేటలో 1038 ఎకరాల ఫీల్ ఫైరింగ్ రేంజ్ లీజు గడువు ముగిసినందున పునరుద్ధరించాలన్నారు.

ప్రతి రాష్ట్రంలో ఒక ఐఐఎం నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని ప్రధానికి వివరించారు. 'నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం కింద కేంద్ర వాటాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 347 కోట్ల 54 లక్షల రూపాయలను వెంటనే విడుదల చేయాలి. భారత్ మాల పరియోజన జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా తెలంగాణకు ప్రయోజనంగా ఉండే ఎనిమిది ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. కల్వకుర్తి-కొల్లాపూర్, గౌరెల్లి-వలిగొండ, తొర్రూర్-నెహ్రూనగర్, నెహ్రూనగర్-కొత్తగూడెం, జగిత్యాల-కరీంగర్ నాలుగులైన్లు, జడ్చర్ల-మరికల్ నాలుగు లైన్లు, మరికల్-డియసాగర్ నిలిచిపోయిన టెండర్ల ప్రక్రియకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలి. ఇండియా సెమీ కండకర్ల మిషన్లో భాగంగా తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకరించాలి' అని తన వినతిపత్రంలో సిఎం రేవంత్ ప్రధాని మోడీని కోరారు.

**ఎయిర్‌పోర్ట్‌లో మోదీ, రేవంత్‌ల మధ్య సరదా సంభాషణ...**

ప్రధాని మోడీ తెలంగాణ పర్యటన ముగించుకొని దిల్లీ బయలుదేరిన సమయంలో జరిగిన సంఘటన ఆసక్తికరంగా మారింది. ప్రధాని మోడీ, సిఎం రేవంత్ రెడ్డి మధ్య సరదా సన్నివేశం చోటు చేసుకుంది. ఆ సమయంలో తీసిన చిత్రం వైరలైంది. ప్రధానిని హస్తినకు సాగనంపే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, బిజెపి నేత రాములు విమానం వద్ద పిఎం గురించి వేచి ఉన్నారు. అప్పుడే విమానం ఎక్కడానికి వస్తున్న పిఎం మోడీకి వీడ్కోలు చెప్పడానికి సిఎం రేవంత్ రెడ్డి పుష్పగుచ్చం ఇచ్చారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com